సోమవారం
05-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 343
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## షెంజౌ-15 మిషన్ సక్సెస్

చైనాకు చెందిన మానవసహిత వ్యోమనౌక షెంజౌ-15 ఆదివారం భూమిపై దిగింది. టియాంగోంగ్ అంతరిక్ష కేంద్రంలో ఆరు నెలల అంతరిక్ష మిషన్ విజయవంతంగా పూర్తి చేసుకొని ముగ్గురు వ్యోమగాములు తిరిగి వచ్చారు.

2లో

# పోలవరం ప్రశ్నార్థకం !



- ఇప్పటికే మూడు గడువులు పూర్తి
- తాజాగా 2025 వరకు పొడిగింపునకు యత్నం
- 41.15 మీటర్లకే ప్రాజెక్టు ఎత్తు కుదింపు
- ఇక రెండో దశ పూర్తయ్యేదెప్పుడో ?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

ఏపీకి అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు పూర్తి నిర్లక్ష్యానికి గురవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పదే పదే పెంచుతున్న గడువులతో అసలు ఈ ప్రాజెక్టు పూర్తవుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తి ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వం పోలవరాన్ని సోమవారంగా మార్చి ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించింది. పునరావాసం మినహా ప్రాజెక్టు పనులు దాదాపు 72 శాతం పూర్తి చేసింది. 2020కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2021 నాటికి పూర్తి చేసి చూపిస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసింది. అదేసమయంలో కాంట్రాక్టరును మార్చింది. ఆ తర్వాత రెండుసార్లు గడువు పెంచింది. ఇప్పుడు ఏకంగా 2025 వరకు పూర్తి చేయలేమంటూ చేతులెత్తేసింది. మరోపక్క ప్రాజెక్టు ఎత్తు కూడా 41.15 మీటర్లకు కుదించారు. దానిపై ప్రతిపక్షాలు ధ్వజమెత్తితే అది కేవలం తొలిదశ మాత్రమేనని, మలిదశలో ప్రాజెక్టు అసలు డిజైన్ ప్రకారం 45.72 మీటర్లు ఉంటుందని జగన్ ప్రభుత్వం నమ్మబలుకుతుంది. ఈనెల 1వ తేదీన ఢిల్లీలోని జలశక్తి కార్యాలయంలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన పోలవరం నిర్మాణ పురోగతి, ఆర్థిక వ్యయాలపై సమీక్ష జరిగింది. సమావేశానికి ఏపీ నుంచి హాజరైన జలవనరుల శాఖాధికారులు పోలవరం తొలిదశ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి 2025 జూన్ వరకు గడువు పెంచాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై విస్మయం చెందిన కేంద్రమంత్రి...మీ ముఖ్యమంత్రి ఎన్నికల్లోగా (2024 ఏప్రిల్ నాటికి) తొలిదశ నిర్మాణం పూర్తి చేయాలని అనుకుంటుండగా, మీరు మరో ఏడాది గడువు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. ఆ గడువు ప్రకారమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి ఆదేశించారు. అయితే 41.15 మీటర్ల కాంటూరులో నిర్మాణ పనులు, భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల కోసం రూ.17,144 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు తెలియజేశారు. వీటికి వరదల కారణంగా దెబ్బతిన్న డయాఫ్రం వాల్ మరమ్మతులకు అంచనా వేసిన రూ.1,556 కోట్లు కలిపితే మొత్తం రూ.18,700 కోట్లు అవసరమవుతుందని అధికారులు కేంద్రమంత్రికి వివరించారు. తొలిదశ ప్రాజెక్టు నీటి నిల్వ కోసం 68,539 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటివరకు 65,628 ఎకరాలు సేకరించారు. మరో 2,910 ఎకరాలు సేకరించాల్సి ఉంది. 2005 భూసేకరణ చట్టం ప్రకారం 3,780 నిర్వాసిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 2013 భూసేకరణ చట్టం ప్రకారం 8,280 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇంకా 8,886 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖాధికారులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తొలిదశ నిర్మాణం పూర్తికి రూ.17,144 కోట్లు అడ్‌హాక్ నిధులుగా ముందస్తుగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కేంద్రం వీటిపై త్వరితగతిన నిర్ణయం తీసుకుని విడుదల చేస్తే తప్ప తొలిదశను కూడా రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న గడువు ప్రకారం పూర్తి చేయలేని పరిస్థితి. ఇక రెండో దశ ప్రాజెక్టు వాస్తవ డిజైన్ ప్రకారం 45.72 మీటర్ల ఎత్తుకు భూసేకరణ, పునరావాస చర్యలు పూర్తి చేయాలంటే అది ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు, పోలవరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులను ప్రతిపక్షాలు తూర్పారబడుతున్నాయి. పోలవరం నిర్మాణంపై ఏమాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శిస్తున్నాయి. పోలవరం పూర్తి చేయకుండా రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని సీఎం జగన్‌పై మండిపడుతున్నాయి. రాజకీయాలను పక్కన పెట్టి పోలవరం పూర్తిపై దృష్టి సారించాలని హితవు పలుకుతున్నాయి.

# మండిన 'సండే'

- 46 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- కర్ఫ్యూని తలపించిన రహదారులు
- ఎండల తీవ్రతకు ప్రజలు బెంబేలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

రాష్ట్రం అగ్నిగుండంగా మారింది. రోహిణీ కార్తె ప్రభావంతో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. మండే ఎండలకు తోడు ఉక్కపోత ఉడికిస్తుంటే...ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ మండిపోతుండటంతో జనం బయటకు రావడానికి భయపడుతున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతాల్లో 44 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు 135 మండలాల్లో ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు తీవ్రంగా వీచాయి. పల్నాడు జిల్లా రావిపాడులో 46, తూర్పుగోదావరి జిల్లా పెరవలి, బాపట్ల జిల్లా వేమూరు, మన్యం జిల్లా పెదమేరంగిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజులుగా ఎండ తీవ్రత ఏమాత్రం తగ్గకపోగా రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక అప్రకటిత విద్యుత్ కోతలతో ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు అల్లాడిపోతున్నారు. విశాఖలో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నైరుతి రుతుపవనాల ఆలస్యం కారణంగా ఎండల తీవ్రత మరింత అధికమైంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అత్యధికంగానే నమోదవుతున్నాయి. వడగాడ్పుల ధాటికి జనం అల్లాడిపోతున్నారు. ఇంటి నుండి బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. గాలిలో తేమ అధికంగా ఉండడంతో ఉక్కపోత కూడా జనాన్ని మరింత ఉడికిస్తోంది. ఈనెల 8వ తేదీ వరకు రోహిణి కార్తె ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ నిపుణులు

- మిగతా 2 లో

## ఏపీకి మోదీ సర్కారు తీరని ద్రోహం

# అమిత్ షా పర్యటనను నిరసించండి

**పది మంది వామపక్ష నేతల పిలుపు**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ అధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు విచ్చేస్తున్న హోంమంత్రి అమిత్‌షా పర్యటనను నిరసించాలని 10 వామపక్ష పార్టీలు ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చాయి. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, వై.సాంబశివరావు (సీపీఐ(యంఎల్) న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్‌బాబు (సీపీఐ(యంఎల్)), కాటం నాగభూషణం(యంసీపీఐ(యు)), యస్.మూర్తి (సీపీఐ(యంఎల్) లిబరేషన్), బీఎస్ అమర్‌నాథ్ (యస్‌యూసీఐ(సి)), పీవీ సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సీపీఐ(యంఎల్) న్యూడెమోక్రసీ) తొమ్మిదేళ్ల బీజేపీ విద్రోహాన్ని ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. '2014లో అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తదితర హామీలు ఇచ్చింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత గత పార్లమెంటులోనూ, ఎన్నికల సందర్భంగానూ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. ప్రత్యేకహోదా ప్రసక్తే లేదు. కంటితుడుపు కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. విభజన చట్టంలోని హామీలు అరకొరగా అమలు చేసింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధుల ఊసే లేదు. పోలవరం నిర్మాణం పూర్తి చేయడానికి కేంద్రం నిధులు విడుదల చేయకపోగా 2 లక్షలకు పైగా ఉన్న నిర్వాసితుల పునరావాసం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రభుత్వరంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నది. విశాఖ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాపితంగా దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నా చీమకుట్టినట్టు కూడా లేదు. ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతున్నది. రాష్ట్రంలో పండుగలను ఆసరా చేసుకొని మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నది. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నది. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచి, రాష్ట్రాల హక్కులను హరిస్తున్నది. నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచింది. నూతన ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తూ కార్పొరేట్‌లకు దోచిపెడుతున్నది. ఇలా రాష్ట్రానికి, దేశ ప్రజలకు తీరని ద్రోహం చేసిన బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్ల ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల రాష్ట్ర పర్యటన పట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేయాలి. అమిత్‌షా విశాఖ పర్యటనను వ్యతిరేకించండి. రాష్ట్రాభివృద్ధిని కోరుకునే వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు ఈ పిలుపును బలపరచండి' అని వామపక్ష నేతలు విజ్ఞప్తి చేశారు.

## కారణం తెలిసింది...

# బాధ్యులను గుర్తించాం

- నివేదిక వచ్చాక చర్యలు
- ముగిసిన సహాయక చర్యలు- మృతదేహాల తొలగింపు
- యుద్ధప్రాతిపదికన పట్టాల పునరుద్ధరణ
- వెయ్యి మందితో పనులు
- మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత
- రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



బాలాసోర్:

ఒడిశాలో ఘోర రైలు ప్రమాదానికి ప్రధాన కారణం ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలో మార్పు జరగడమేనని, ఇందుకు బాధ్యులనూ గుర్తించామని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పట్టాలపై పడివున్న బోగీలను తొలగించినట్లు చెప్పారు. బుధవారం నాటికి పట్టాలు పునరుద్ధరించే లక్ష్యంతో పని చేస్తున్నామని ఆయన అన్నారు. సహాయక చర్యలు పూర్తయ్యాయని, మృతదేహాలన్నింటినీ తొలగించినట్లు తెలిపారు. ప్రమాద ఘటనలో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న వైష్ణవ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ దుర్ఘటనకు దారి తీసిన పరిస్థితులపై రైల్వే భద్రతా విభాగ కమిషనర్ విచారణ జరిపినట్లు తెలిపారు. పూర్తి నివేదిక వచ్చాక అన్ని విషయాల్లో స్పష్టత వస్తుందని, అన్ని విషయాలు ఇప్పుడే చెప్పలేనన్నారు. పునరుద్ధరణ చర్యలపైనే దృష్టి పెట్టామని, బుధవారం ఉదయానికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైలు ప్రమాదానికి, కవచ్ వ్యవస్థకు సంబంధం లేదన్నారు. రైల్వే సిగ్నలింగ్, ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్‌కు కీలకమైన ఎలక్ట్రిక్ పాయింట్ మెషిన్‌లో సెట్టింగ్ మారడం వల్లనే ప్రమాదం జరిగిందని, అయితే అది ఎప్పుడు, ఎలా జరిగిందన్నది తెలియాల్సి ఉందన్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించినట్లు చెప్పారు. 'సోరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, వైద్యులను కలిశాం. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, రాంచీ, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతూ రోగులను చికిత్స కోసం స్వస్థలాలకు తరలిస్తున్నాం. పట్టాల పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. మెయిన్ లైన్లలో ఒకటి దాదాపు సిద్ధమైంది' అని వైష్ణవ్ అన్నారు. శుక్రవారం రాత్రి నుంచి ఘటనాస్థలిలో ఉండి సహాయక చర్యలు, రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ పనులను కేంద్రమంత్రి సమీక్షిస్తున్నారు. వెయ్యిమందికిపైగా సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తూ ట్రాక్‌లకు మరమ్మతులు చేస్తున్నారని, ఏడుకుపైగా ప్రొక్లెయినర్లు, రెండు

- మిగతా 2 లో

### ఒడిశా ప్రమాదంపై సీబీఐ విచారణకు రైల్వే బోర్డు సిఫార్సు

భువనేశ్వర్ :

ఒడిశా రైలు ప్రమాదంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తో దర్యాప్తు చేయించాలని రైల్వే బోర్డు సిఫార్సు చేసిందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన భువనేశ్వర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సహాయక కార్యక్రమాలు పూర్తయ్యాయని, ఘటనా స్థలిలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైల్వే ట్రాక్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయన్న మంత్రి... ఓవర్ హెడ్ విద్యుత్ లైన్ల పనులు కొనసాగుతున్నాయని

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

ప్రపంచ పర్యావరణ దినోత్సవం చేస్తున్నాం, నీ పనులు పక్కన పెట్టి రావాలి

## ప్రమాదానికి గురైన రైళ్లలో

# ఏపీ ప్రయాణికులెందరు?

**అన్‌రిజర్వుడ్ లెక్కలపై కొనసాగుతున్న గందరగోళం**

- ఇంకా గుర్తించని 180 మృతదేహాల వివరాలు
- ఫోన్‌లకు స్పందించని 28 మంది జాడ కోసం గాలింపు
- బాధితుల సహాయక చర్యలపై సీఎం జగన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :

ఒడిశాలో ప్రమాదానికి గురైన కోరమాండల్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల్లో మొత్తం ఏపీ ప్రయాణీకులు ఎంతమంది ఉన్నారు? వారిలో మరణించిన వారెందరు? తీవ్ర గాయాలతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారెందరు? క్షేమంగా ఇంటికి చేరిన వారెందరు? అనే లెక్కలు ఇంకా

- మిగతా 2 లో

# బీజేపీని మట్టి కరిపిస్తాం

- తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లోనూ కర్నాటక ఫలితాలే
- 2024 ఎన్నికల్లో విపక్షాలన్నీ ఏకమవుతాయి
- ప్రజలే ఆ పార్టీని ఇంటికి పంపుతారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ:

కాంగ్రెస్ పార్టీ తదుపరి లక్ష్యం తెలంగాణ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కర్నాటక తరహాలోనే బీజేపీని తెలంగాణ సహా ఇతర అన్ని రాష్ట్రాల్లో మట్టికరిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ... న్యూయార్క్‌లో శనివారం ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్- యూఎస్‌ఏ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ... భారత దేశ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీని మట్టికరిపించగలమని మేము కర్నాటకలో చూపించాము. మేము ఆ పార్టీని కేవలం ఓడించలేదు... మట్టికరిపించాము. కర్ణాటకలో బీజేపీని గట్టిదెబ్బ కొట్టాము. వాస్తవానికి ఇది కాంగ్రెస్ పార్టీ విజయం కాదు. ఆ పార్టీ విద్వేషపూరిత సిద్ధాంతాలను ప్రజలు తిప్పికొట్టారు' అని రాహుల్ అన్నారు. 'విపక్షాన్ని ఓడించేందుకు బీజేపీ చాలా ప్రయత్నాలు చేసింది. ఆ పార్టీ దగ్గర మొత్తం మీడియా ఉంది. మా దగ్గర ఉన్న డబ్బు కన్నా వాళ్ల దగ్గర 10రెట్లు ఎక్కువ నిధులు ఉన్నాయి. ఏజెన్సీ కూడా వారి వెనకే ఉంది. కానీ మేము వారిని మట్టికరిపించాము. నేను మీకు ఇక్కడ ఇంకో విషయం చెప్పాలనుకుంటున్నా. మా నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ. బీజేపీని అక్కడ మట్టికరిపిస్తాం. వచ్చే ఎన్నికల తర్వాత... తెలంగాణలో బీజేపీ కనిపించడమే కష్టంగా మారుతుంది' అని రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణలో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్?, చత్తీస్‌గఢ్

- మిగతా 2 లో

# షెంజౌ-15 మిషన్ సక్సెస్

## ఆరు నెలల తర్వాత తిరిగొచ్చిన చైనా వ్యోమగాములు

**బీజింగ్:** చైనాకు చెందిన మానవసహిత వ్యోమనౌక షెంజౌ-15 ఆదివారం భూమిపై దిగింది. టియాంగోంగ్ అంతరిక్ష కేంద్రంలో ఆరు నెలల అంతరిక్ష మిషన్ విజయవంతంగా పూర్తి చేసుకొని ముగ్గురు వ్యోమగాములు తిరిగి వచ్చారు. ఈ మేరకు చైనా అంతరిక్ష సంస్థ (సీఎంఎస్ఏ) తెలిపింది. బీజింగ్ కాలమానం ప్రకారం ఉదయం 6.33 గంటలకు షెంజౌ-15...దోంగ్‌ఫెంగ్ లాండింగ్ సైట్‌లో దిగిందని, 30 నిమిషాల తర్వాత క్యాప్సూల్ నుంచి వ్యోమగాములు బయటకు వచ్చారని, వారంతా ఆరోగ్యంగా ఉన్నారని సంస్థ తెలిపింది. క్రూ కమాండర్ ఫె జున్లుంగ్, డెంగ్ క్వింగ్‌మింగ్, జాంగ్ లూ 2022, నవంబరు 30న ఆర్బిటల్ స్టేషన్‌కు వెళ్లినట్లు పేర్కొంది. అంతరిక్షంలో ఉన్న సమయంలో వీరంతా నాలుగు సార్లు స్పేస్ వాక్‌లు చేశారని, అనేక శాస్త్రీయ, సాంకేతికపరమైన ప్రయోగాలు నిర్వహించారని వెల్లడించింది. మే 30న టియాంగోంగ్‌కు వెళ్లిన షెంజౌ-16 క్రూ సభ్యులు మరో ఐదు నెలలు అంతరిక్షంలోనే గడపనున్నట్లు సీఎంఎస్ఏ తెలిపింది.

## ఉక్రెయిన్‌పై ఐరాస రెఫరెండం ఇండోనేసియా ప్రతిపాదన

**సింగపూర్:** ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించేలా శాంతి ప్రణాళికను ఇండోనేసియా రక్షణమంత్రి ప్రబోవో సుబియాంటో ప్రతిపాదించారు. సైనికరహిత జోన్ అవసరాన్ని నొక్కిచెప్పారు. ఐక్యరాజ్యసమితి రిఫరెండాన్ని (అభిప్రాయ సేకరణ) నిర్వహించాలని సూచించారు. ఉక్రెయిన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఓలెగ్ నికోలెంకో ఈ ప్రణాళికను తోసిపుచ్చారు. ఉక్రెయిన్ నుంచి సైన్యాన్ని రష్యా ఉపసంహరించుకోవాలని పట్టుపట్టారు. రెండు దేశాల మధ్య వివాదాస్పద స్థలాలేమీ లేవని వాదించారు. సుబియాంటో ప్రపంచ దేశాల రక్షణ, సైన్యాధికారులతో సింగపూర్‌లో షాంగ్రిలా చర్చలు జరిపి ఒక తీర్మానం చేశారు. కాల్పుల విరమణ, రెండు పక్షాలు సుమారు 15కిమీలు వెనక్కి తగ్గి డిమిలటరైజ్డ్ జోన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ జోన్‌ను ఐరాస నియమిత శాంతిదళం పర్యవేక్షించాలని అన్నారు. ఐరాస రెఫరెండాన్ని నిర్వహించడం సబబుగా ఉంటుందని సూచించారు. గతేడాది మాస్కో కీవ్‌ను సందర్శించిన ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోదో... రెండు దేశాల మధ్య శాంతి చర్యలకు మధ్యవర్తిత్వం వహిస్తామని చెప్పిన క్రమంలో తాజా ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది.

విశాలాంధ్ర ప్రపంచం

## టర్కీ అధ్యక్షుడిగా ఎర్డోగన్ ప్రమాణ స్వీకారం

**అంకారా:** టర్కీ అధ్యక్షుడిగా రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ (69) మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. 20 ఏళ్లపాటు టర్కీని పాలించిన ఎర్డోగన్ మరో ఐదేళ్ల పరిపాలనకు సిద్ధమయ్యారు. ఆయన ప్రమాణ స్వీకారానికి వివిధ దేశాల ప్రముఖులు హాజరయ్యారు. నాటోలో అమెరికా తరవాత రెండో అతిపెద్ద సైన్యం ఉన్నది టర్కీకే కావడం గమనార్హం. కాగా, లక్షలాది మంది సిరియా శరణార్థులకు ఆశ్రయమిచ్చే టర్కీ, ఉక్రెయిన్ నుంచి ఆహార ధాన్యాల సరఫరాకు మధ్యవర్తిత్వం వహించి ప్రపంచ ఆహార భద్రతకు తోడ్పడింది. నాటోలో కొత్తగా ఏ దేశం చేరాలన్నా నాటో సభ్యులంతా ఏకగ్రీవ సమ్మతి తెలపాలి.

## చైనాలో విరిగిపడ్డ కొండచరియలు 14 మంది మృతి

**బీజింగ్:** నైరుతి చైనాలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. మరో ఐదుగురి ఆచూకీ లేదు. ఈ మేరకు చైనా మీడియా ఆదివారం పేర్కొంది. షిచువాన్ ప్రావిన్స్‌లో లెషన్ నగరం సమీపంలోని కొండ ప్రాంతంలో ఈ ఘటన ఉదయం 6 గంటలప్పుడు చోటుచేసుకున్నట్లు తెలిపింది. 180 మందికిపైగా సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని, ఆపరేషన్ కొనసాగుతోందని సీసీటీవీ నివేదించింది.

రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో షిచువాన్ ప్రావిన్‌లో కొండచరియలు విరిగిపడ్డాయని వెల్లడించింది.

## పాక్ నుంచి 200 మంది జాలర్ల విడుదల

**ఇస్లామాబాద్:** తమ దేశ జైళ్లలో ఉన్న 200 మంది భారతీయ జాలర్లను పాకిస్తాన్ విడుదల చేసింది. వీరిని వాఘా సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్ దళాలకు పాక్ అధికారులు అప్పగించారు. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ జారీ చేసిన అత్యవసర ప్రమాణ పత్రం ఆధారంగా వీళ్లందరిని శనివారం వేకుమజామున ఒంటిగంట సమయలో భారత సరిహద్దులకి ప్రవేశించినట్లు తెలుస్తోంది.

## మనసు చలించిపోయింది: బైడెన్

**వాషింగ్టన్:** భారత్, ఒడిశా రాష్ట్రంలో శుక్రవారం జరిగిన ఘోర రైలు ప్రమాదం గురించి తెలిసి తన మనస్సు చలించిపోయిందని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ అన్నారు. మృతులకు సంతాపాన్ని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అమెరికా తరపున సానుభూతి తెలుపుతూ ఒక ప్రకటన వెలువరించారు. 'ఈ దుర్వార్త విని నా గుండె చెరువైంది. జిల్ బైడెన్, నేను తీవ్ర దిగ్భ్రాంతి చెందాం. తమ వారిని కోల్పోయిన వారి కోసం ప్రార్థిస్తున్నాం. బాధితుల కోసం అమెరికా సంతాపం వ్యక్తం చేస్తోంది. సహాయక చర్యలు కొనసాగుతున్న వేళ మా ఆలోచనలన్నీ బాధితుల కుటుంబాలపైనే ఉన్నాయి' అని బైడెన్ పేర్కొన్నారు.

## న్యూజెర్సీలో భారతీయ విద్యార్థి సజీవ దహనం

**న్యూజెర్సీ:** అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతీయ విద్యార్థి సజీవ దహనమయ్యారు. తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లా, భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన గుర్రపు శైలేష్ (25) కారుకు న్యూజెర్సీలో సెల్టన్ కూడలి వద్ద ప్రమాదం జరిగింది. శైలేష్ కారును వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. అయితే నేరుగా గ్యాస్ ట్యాంకును ఢీకొట్టడంతో మంటలు చెలరేగి శైలేష్ అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. శైలేష్ బయో-మెడికల్ ఇంజినీరింగ్ చదివేందుకు సెప్టెంబరులో అమెరికాకు వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ బ్రిడ్జిపోర్ట్‌లో మాస్టర్స్ చేస్తున్నారు. శైలేష్ మృతదేహాన్ని శైలేష్ మృతదేహాన్ని సోమవారం హైదరాబాద్‌కు తరలించేందుకు తానా సభ్యులు చర్యలు చేపట్టారు.

## బీజేపీని మట్టి కరిపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలు కూడా త్వరలో ఎన్నికలకు వెళ్లనున్నాయి. 'బీజేపీని కాంగ్రెస్ ఓడించడం లేదు. దేశ ప్రజలే ఆ పార్టీని ఇంటికి పంపిస్తారు. మధ్యప్రదేశ్?, రాజస్థాన్?, తెలంగాణ, చత్తీస్‌గఢ్‌లో ప్రజలు బీజేపీని ఓడిస్తారు' అని రాహుల్ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం విపక్షాలన్నీ ఏకమవుతాయని రాహుల్ అభిప్రాయపడ్డారు. 'బీజేపీ విద్వేషపూరిత సిద్ధాంతాల దుష్ప్రభావాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు. బీజేపీ సమాజంలో వ్యాప్తి చేస్తున్న ద్వేషంతో పురోగమించలేమని తెలుసుకున్నారు. అందుకే బీజేపీని ఓడిస్తారు. ఇందుకోసం కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ ఒక్క తాటిపైకి వస్తాయి. కొన్ని రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల్లో అదే జరగబోతోంది. ఆ తర్వాత 2024లో కూడా అదే చేస్తాం...ప్రతిపక్షం ఒక్కటైంది, అందరం కలిసి పని చేస్తున్నాం. ఇది సైద్ధాంతిక పోరాటం. 2024 ఎన్నికల్లోనే కాదు ఆ తర్వాత కూడా విపక్షాలు ఐకమత్యంతో ఉంటాయి. ఒకవైపు బీజేపీ విభజన భావజాలం, విద్వేషాలు ఉంటుంటే... మరోవైపు ప్రేమ, ఆప్యాయతతో కూడిన సిద్ధాంతాలు ఉన్నాయి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ కూడా హాజరైన ఈ కమ్యూనిటీ కార్యక్రమంలో కాంగ్రెస్ మద్దతుదారులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, భారతీయ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోలో కార్యక్రమాలను ముగించుకొని న్యూయార్క్ వచ్చారు. ఆదివారం మాన్‌హాటన్‌లోని జావిట్స్ సెంటర్‌లో జరిగే సభలో ప్రసంగించనున్నారు.

## సీబీఐ విచారణకు రైల్వే బోర్డు సిఫార్సు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. 'ఈ ప్రమాదం జరిగిన తీరు, పరిస్థితులు, పరిపాలనా సమాచారం ఆధారంగా రైల్వే బోర్డు సీబీఐ విచారణకు సిఫార్సు చేసింది' అని ఆయన చెప్పారు. ఇదిలాఉండగా, అంతకుముందు రోజు, రైల్వేలు డ్రైవర్ లోపం, వ్యవస్థ లోపాన్ని వాస్తవంగా తోసిపుచ్చాయి. ఒడిశాలో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదం ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌ను ట్యాంపరింగ్ చేయడం వల్ల సంభవించిందని సూచిస్తుంది. వైష్ణవ్ ప్రకారం, ప్రమాదానికి గల 'మూల కారణం', అలాగే దానికి కారణమైన నేరస్తులను గుర్తించారు. బాధితులకు ఆస్పత్రుల్లో చికిత్స కొనసాగుతోందని అన్నారు. బాలేశ్వర్, కటక్, భువనేశ్వర్‌లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా మద్దతుగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఆయా ఆస్పత్రుల్లో వారికి అన్ని వసతులూ కల్పించినట్లు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయని అన్నారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను సంప్రదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు.

# రైతులను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వాలు

## సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

**విశాలాంధ్ర బ్యూరో-పల్నాడు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు నానాటికి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారని, దీంతో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం ఆహ్వాన కమిటీ సమావేశంలో ముప్పాళ్ల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్థిక విధానాలతో ఒక పక్కన దేశం, మరో పక్కన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నల్ల చట్టాలు తెచ్చి రైతులను మరింత సంక్షోభంలో నెట్టాలని మోదీ ప్రయత్నించారని, రైతులు నిరంతర పోరాటం చేసి నల్ల చట్టాలను తిప్పి కొట్టారని అన్నారు. ఆంధ్రుల జీవనాడైనా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జాప్యానికి కేంద్ర ప్రభుత్వం కారణమన్నారు. రైతుల ఇబ్బందులను తెలుసుకొని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించేందుకు ఈనెల 13, 14, 15 తేదీల్లో నరసరావుపేట పట్టణంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సమ్మేళనం సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రైతు సమ్మేళనం సభలలో అఖిల భారత స్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం పల్నాడు జిల్లాలో రైతు సమ్మేళనం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని, రైతులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాలో నిలిచిపోయిన హరిచంద్రపురం, వరికెపూడిసెల ప్రాజెక్టులను సత్వరం నిర్మించాలని, నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో కాలువలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవపూడి రాము, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు సీజే ప్రతాప్, షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, సుబ్బాయమ్మ, బూదాల శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, జంగుల వెంకటేశ్వర్లు, షేక్ చిన్న జాను సైదా, ఏఐవైఎఫ్ నాయకులు సుభాని పాల్గొన్నారు.

## వీఆర్ఏల సంక్షేమం పట్టదా?

### గుజ్జుల ఈశ్వరయ్య ప్రశ్న

**విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్):** ఆంధ్రప్రదేశ్ సంక్షేమంలో గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్ఏ) సంక్షేమం ఉందా? లేదా? అనే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలోని రాష్ట్ర ఉపాధ్యాయ భవన్(ఎస్టీయూ)లో గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. నల్లిపోగు నాగేశం అధ్యక్షతన జరిగిన సదస్సులో ఈశ్వరయ్య మాట్లాడుతూ వీఆర్ఏలు చిరు ఉద్యోగులుగా (4వ తరగతి) కూడా గుర్తింపునకు నోచుకోవడం లేదన్నారు. 56 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలను ఉద్యోగులుగా కూడా గుర్తించకపోవడం దారుణమన్నారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద జరిగిన వీఆర్ఏల ధర్నాలో పాల్గొని... వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మాట తప్పను-మడమ తిప్పను అని చెప్పుకునే జగన్‌కు వీఆర్ఏల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 690 మండలాలలో 27 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. నవరత్నాల ద్వారా రాష్ట్ర సంక్షేమాన్ని చూసే సీఎంకు...వీఆర్ఏల సంక్షేమం కనపడకపోవడం శోచనీయమన్నారు. వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమ కార్యాచరణ రూపొందించి పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ముందుగా ప్రజానాట్యమండలి నాయకులు అభ్యుదయ గీతాలు ఆలపించారు. సీనియర్ నాయకులు ఎం.రామకృష్ణ, కె.పుల్లయ్య, కె.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, వై.శ్రీనివాస్ వర్మ, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుజ్జుల ఈశ్వరయ్య. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నల్లిపోగు నాగేశం, కోశాధికారిగా ఇరుపోతు శ్రీనివాసులు వర్మ, ఉపాధ్యక్షులుగా కొమ్మాది ఈశ్వరయ్యలతో పాటు 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

# మృతులు 275 మందే

## ఒడిశా ప్రభుత్వం స్పష్టీకరణ

**భువనేశ్వర్:** ఒడిశాలోని బాలేశ్వర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ఇప్పటి వరకు 275 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఒడిశా ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఇంతకుముందు 288 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పిన అధికారులు... మృతదేహాల లెక్కింపులో పొరపాట్లు జరిగినట్లు చెప్పారు. కొన్ని మృతదేహాలను రెండుసార్లు లెక్కించారని, సంఘటన స్థలంలో లెక్కించి, ఆ తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లిన తర్వాత మరోసారి లెక్కపెట్టారని ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా వెల్లడించారు. దీంతో మృతుల సంఖ్యలో తేడా వచ్చిందని, చివరిసారి లెక్కించినప్పుడు స్పష్టత వచ్చిందని తెలిపారు. మొత్తం 275 మంది మృతుల్లో ఇప్పటి వరకు 78 మృతదేహాలను గుర్తించి వారి బంధువులకు అప్పగించినట్లు చెప్పారు.

మరో 10 మృతదేహాలను అప్పగించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మిగతా 187లో 170 మృతదేహాలను భువనేశ్వర్‌కు, 17 మృతదేహాలను బాలేశ్వర్ జిల్లా కేంద్రానికి తరలించినట్లు చెప్పారు. మొత్తం 85 అంబులెన్స్‌ల ద్వారా మృతులను భువనేశ్వర్‌లోని వివిధ మార్చురీలకు తరలించినట్లు చెప్పారు.

## బాధ్యులను గుర్తించాం

(మొదటిపేజీ తరువాయి)

యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, మూడు, నాలుగు రైల్వే, రోడ్డు క్రేన్ల సహాయంతో పనులు చకాచకా జరుగుతున్నాయని రైల్వేమంత్రి చెప్పారు. ప్రమాదం కారణంగా చెల్లాచెదురుగా పడిన 21 బోగీలను బహనగా బజార్ స్టేషన్ వద్దకు చేర్చామని, ఘటనాస్థలిలో అడ్డుగా ఏమీ లేవని రైల్వే అధికారులు వెల్లడించారు.

రైల్వే ప్రమాదంలో చనిపోయిన వారి సంఖ్య 288 నుంచి 295కు పెరిగినట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. అయితే అధికారికంగా ధ్రువీకరించలేదు. దిల్లీ ఎయిమ్స్‌తో పాటు దేశ రాజధానిలోని సెంట్రల్ హాస్పిటల్స్ నుంచి వైద్యులు, నిపుణులు భువనేశ్వర్‌కు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలను వైద్యులు తీసుకెళ్లినట్లు ఓ అధికారి తెలిపారు.

మరోవైపు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రధాని మోదీతో ఫోన్‌లో తాజా పరిస్థితిని వివరించారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇతర ఆరోగ్య సంరక్షణ సిబ్బంది శాయశక్తులా పనిచేస్తున్నట్లు మోదీకి తెలిపారు. ఒడిశాలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీంతో ఒడిశా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఆపదవేళ పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందించినందుకు అభినందించారు. తమ రాష్ట్రానికి చెందిన బాధితుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని ఒడిశా సీఎం ప్రకటించారు. కాగా, శతాబ్దంలోనే అతిపెద్ద రైలు ప్రమాదం ఇది... 'కవచ్' ఉంటే ప్రమాదాన్ని నివారించేందుకు అవకాశముండేది' అని రెండుసార్లు రైల్వే మంత్రిగా పనిచేసిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై రైల్వేమంత్రి స్పందించారు. మమత వ్యాఖ్యలు సరికాదని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు దిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైష్ణవ్ రాజీనామాకు డిమాండ్ చేశారు. లోటుపాట్లను, నేరపూరిత నిర్లక్ష్యాన్ని, భద్రతా ప్రమాణాలను పట్టించుకోకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు పీఆర్ జిమ్మిక్కులు చేస్తున్నట్లు

ఆరోపించారు. మానవ నిర్లక్ష్యం వల్లనే ఘోరం జరిగిందని కాంగ్రెస్ ఎంపీ శక్తిసిన్హా గోహిల్, ఏఐసీసీ నేత పవన్ ఖేరా అన్నారు. కారకులను కఠినంగా శిక్షిస్తామన్న ప్రధాని ముందుగా రైల్వేమంత్రితో మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీస్థాయి సంఘాలు, నిపుణులు అనేకమార్లు హెచ్చరించినా రైల్వే భద్రత మెరుగుదలపై మోదీ ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టలేదు? నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరించింది? దేశవ్యాప్తంగా కవచ్ వ్యవస్థ అమల్లోకి వచ్చేది ఎప్పుడు? రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ (ఆర్ఆర్ఎస్‌కే)కు మరిన్ని నిధులు సమకూరేది ఎప్పుడు? భారతీయ రైల్వేలో ఉన్న 3 లక్షలకుపైగా ఖాళీలు భర్తీ చేసేదెప్పుడు? అని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు నిలదీశారు. రైల్వే, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్, ఐటీ మొత్తం ఒక్క మంత్రే చూసుకోవడం కష్టమని ఎంపీ కపిల్ సిబల్ అన్నారు.

# భావానికి తగిన భాషను సంక్షిప్తంగా వాడాలి

## రాష్ట్ర కమ్యూనికేషన్ సలహాదారు జీవీడీ కృష్ణ మోహన్

**విశాలాంధ్ర-విజయవాడ:** భావానికి తగిన భాషను సంక్షిప్త పద్ధతుల్లో ఉపయోగించడం ప్రస్తుత జర్నలిజం శైలికి అత్యంత అవసరమని రాష్ట్ర కమ్యూనికేషన్ సలహాదారు జీవీడీ కృష్ణ మోహన్ అన్నారు. సి. రాఘవాచారి మీడియా అకాడమీ అధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే ఆన్ లైన్ అవగాహన తరగతుల్లో ప్రత్యేక ప్రసంగం చేశారు. 'భాషా పరిజ్ఞానం - పదునైన భాష వాడకం' అనే అంశం పై మాట్లాడుతూ పేజీలు పేజీలు చదివే ఓపిక లేని రోజుల్లో మన భావాన్ని సాధ్యమైనంత సంక్షిప్త పదాల్లో వ్యక్తం చేయడం ముఖ్యమన్నారు. పక్షి కూత అంతటి స్వల్ప పరిమాణంలో 'ట్విట్టర్' వంటి డిజిటల్ వేదికలు సమాచారాన్ని చేర వేస్తోన్న ప్రస్తుత పరిస్థితులు మనకు సంక్షిప్తత అవసరాన్ని నొక్కి చెపుతున్నాయన్నారు. ట్విట్టర్, ఫేస్ బుక్ వంటి డిజిటల్ మాధ్యమాలకు ప్రజల ఆమోదం రోజు రోజుకు ఎక్కువ అవుతోందన్నారు. దీనికి ప్రధాన కారణం క్షణం తీరిక లేని పనిఒత్తిడి, పఠనాసక్తి రోజు రోజు కు తగ్గిపోతుండటమేనని ఆయన పేర్కొన్నారు. వార్త రాసేటపుడు, ఎడిటింగ్ చేసేటపుడు ఈ అంశాన్ని పరిగణన లోకి తీసుకోవాలని సూచించారు. 1990 దశకంలో విద్యార్థి ఉద్యమాలు, సామాజిక ఉద్యమాల నేపథ్యం నుంచి జర్నలిజంలో ప్రవేశించిన వారు భాషపై పట్టుకలిగి ఉండేవారన్నారు. వీరికి ఆయా సమాజాలపై, వ్యవస్థలపై, భాషపై, పూర్తి అవగాహన ఉండేదని, వారి భావ వ్యక్తీకరణ అవసరమైన స్థాయి లోనే సంక్షిప్తంగా, సరళంగా వుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బీటెక్ చదివిన వారు జర్నలిజం రంగం లోకి వస్తున్నారని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని ఆయన అన్నారు. అయితే, ప్రింట్, ఎలెక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు రాయడంలో మరిన్ని మెలకువలు వీరు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. సామెతలు, జాతీయాలు, నుడికారాలు పై అధ్యయనం చేయాలని సూచించారు. ఇందుకు పుస్తకాలు చదవడం చాలా అవసరమన్నారు. బూదరాజు రాధాకృష్ణ, తల్లాప్రగడ సత్యన్నారాయణ మూర్తి వంటి భాషావేత్తలు రచించిన పుస్తకాలు ఇందుకు దోహద పడతాయన్నారు. తెలుగు, ఆంగ్ల పదాల నిఘంటువులు జర్నలిస్టులు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంతకు ముందు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు 'నేటి ప్రసార మాధ్యమాలు' అనే అంశం పై దూరదర్శన్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ ఆన్‌లైన్ అవగాహన సదస్సుకు అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కోర్సు డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి వక్తలను పరిచయం చేశారు. అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు సమన్వయకర్తగా వ్యవహరించారు.

## మండిన 'సండే'

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేస్తున్నారు. మరో రెండు రోజులు వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని, సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 276 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, మంగళవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేద్కర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు, కొబ్బరి బోండాలు, మజ్జిగ తాగాలని సూచించారు.

## ఏపీ ప్రయాణికులెందరు?

(మొదటిపేజీ తరువాయి)

తేలలేదు. రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణీకుల వివరాలు తెలిసినప్పటికీ, వారిలో కూడా ఇంకా 28 మంది ఫోన్‌లు స్పందించకపోవడంతో అధికార యంత్రాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. వారి జాడ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. వారి సెల్‌ఫోన్‌లు పని చేయడం లేదా? ఇంటికి చేరారా? లేక ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారా? ఉంటే ఏయే ఆసుపత్రుల్లో చేరారు? మరణించిన వారిలో ఏమైనా ఉన్నారా? అనే కోణాల్లో అధికారులు అన్ని ఆసుపత్రుల్లో బాధితులు, మృతుల్లో వారి కోసం వెదుకుతున్నారు. ప్రమాదానికి గురైన కోరమాండల్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల్లో మొత్తం 695 మంది ఏపీ వాసులు ప్రయాణించారని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. వారిలో 553 మంది సురక్షితంగా ఉన్నారని, 92 మంది చివరి నిముషంలో ప్రయాణం రద్దు చేసుకున్నారని గుర్తించారు. అయితే ప్రయాణించిన వారిలో ఇంకా 28 మంది ఫోన్‌కి అందుబాటులోకి రాకపోవడంపై అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వారి ఫోన్ నంబర్ ఆధారంగా లోకేషన్లు గుర్తించి వారి ఇళ్లకు అధికారులను పంపి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో 22 మంది స్వల్పంగా గాయపడగా, వారికి చికిత్స కొనసాగుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి అమర్‌నాథ్, ఆరుగురు అధికారులు ఒడిశా వెళ్లి అక్కడి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. దీనిపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు సీఎం జగన్‌కు చేరవేస్తున్నారు. రిజర్వేషన్ చార్ట్ ప్రకారం కోరమాండల్‌లో 484, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది ఏపీ ప్రయాణికులు ఉండగా, ఈ సమాచారాన్ని ఒడిశాలోని వివిధ ఆస్పత్రుల నుంచి మంత్రి అమర్‌నాథ్, అధికారుల బృందం సేకరిస్తోంది. ప్రమాదంలో మొత్తం 275 మంది మృతి చెందగా వాటిలో ఇంకా 180 మృతదేహాల వివరాలను గుర్తించలేదని ఒడిశా నుంచి రైల్వే అధికారులు ఏపీ ప్రభుత్వానికి తెలియజేశారు. ఫోన్లకు స్పందించని 28 మందిలో అందులో ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే ప్రమాదానికి గురైన బోగీలకు దూరంగా ఉన్న బోగీల్లోనే ఏపీ ప్రయాణీకులు ఉండటం వల్ల సురక్షితంగా ఎక్కువమంది బయటపడినట్లు అధికారులు గుర్తించారు.

**మృతుల కుటుంబాలకు రూ.10, క్షతగాత్రులకు రూ.5 లక్షలు**

ఒడిశాలోని బాలోసోర్ సమీపంలో రైలు ప్రమాద దుర్ఘటన, అధికారులు తీసుకుంటున్న చర్యలపై సీఎం జగన్ ఆదివారం సమీక్షించారు. రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళ్లిన మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం తీసుకుంటున్న చర్యలను, విశాఖపట్నంలో మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పర్యవేక్షణ కార్యకలాపాలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, స్వల్పంగా గాయపడ్డవారికి లక్ష రూపాయల చొప్పున ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్న సహాయానికి అదనంగా ఇది ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.

బాలాసోర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి ఒకరు మరణించారని, ఇదితప్ప రాష్ట్రానికి చెందినవారెవరూ ఈ ఘటనలో మరణించినట్టుగా ఇప్పటివరకూ నిర్ధారణ కాలేదని, గాయపడ్డవారికి మంచి వైద్యసదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఎంత ఖర్చయినా బాధితులకు మెరుగైన వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

# రైతు సమస్యలే ఎన్నికల అజెండా

## 'ఏరువాక పౌర్ణమి'లో రైతు నేతల పిలుపు

**విశాలాంధ్ర-ఒంగోలు:** రైతాంగ సమస్యలే రానున్న సార్వత్రిక ఎన్నికల అజెండా కావాలని, అందుకు తగ్గట్లు పార్టీలు మేనిఫెస్టోలను విడుదల చేయాలని రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతులకు గౌరవ జీవితం కల్పించడమే లక్ష్యంగా పోరాటాలు జరగాలన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్వర్యంలో ఒంగోలులోని ఆచార్యరంగా భవనంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత త్రోవగుంట అండర్‌బ్రిడ్జి నుంచి చీరాల దిగమర్రు రోడ్డులో ఎద్దులతో అరకల కట్టి ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగానికి తగిన గౌరవం దక్కటం లేదన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతులను ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామంటూ పార్టీలు హామీలిస్తాయే తప్ప అధికారంలోకి వచ్చాక రైతు సమస్యలను పట్టించుకోవని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసి ఒక స్థానాన్ని గెలుచుకున్న కర్నాటక రైతాంగ స్ఫూర్తితో వచ్చే ఎన్నికలలో పాలక పార్టీల ఆలోచనతీరు మారేలా రైతాంగ ఉద్యమాలు ఉండాలని వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త డాక్టర్ సుమన్‌సహాయ్ మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మారాలని, అందుకు తగు ప్రణాళికను ప్రభుత్వాలు సిద్ధం చేయాలని అన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కర్నాటకలో బీజేపీని మట్టికరిపించిన రైతు నాయకులను అభినందించారు. బీజేపీ హయాంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. రద్దు చేసిన సాగు చట్టాలను దొడ్డి దారిన అమలు చేసేందుకు యత్నిస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపే ఇందుకు ఉదాహరణ అన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కర్నాటక రాజ్య రైతు సంఘం గౌరవాధ్యక్షులు సామరస పాటిల్, అధ్యక్షులు నాగేంద్ర మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులతో పాటు రైతుల అప్పులు పెరిగాయని, రైతులకు గిట్టుబాటు ధరలు దక్కకపోవడం దుర్మార్గమన్నారు. ఏడుగురు రైతు అభ్యర్థులు పోటీ చేస్తే ఒకరు గెలిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలకులను కాకుండా తమ ప్రవృత్తిని నమ్ముకుని ముందుకు సాగుతున్న వారే రైతులు అన్నారు. ఈ ఏడాది ఏరువాక కార్యక్రమం కూడా రైతుల ఆత్మహత్యలతోనే ప్రారంభమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు జరిగితే రైతు కుటుంబాల్లో ఆనందం విరాజిల్లుతుందన్నారు. రైతులకు అన్యాయం చేయడంలో మోదీకి తిరుగులేదని ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు మర్రెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో వ్యవసాయ రంగం నాశనమైందని, డిమాండ్ల సాధన కోసం రైతులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రైతు స్వరాజ్ వేదిక రాష్ట్ర కో-కన్వీనర్ బాలు గాడి మాట్లాడుతూ రాష్ట్రం రైతు కూలీల ఆత్మహత్యల్లో మొదటిస్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండవస్థానంలో, రైతుల ఆత్మహత్యల్లో మూడోస్థానంలో ఉన్నదన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి, సుబాబుల్ జామాయిల్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక నాయకులు కె.అరుణ, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం నాయకులు సుబ్బారెడ్డి వక్తల్లో ఉన్నారు. అనంతపురం జిల్లా వామపక్ష రైతు నాయకులు వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడానికి వ్యతిరేకిస్తూ సాగించిన ఉద్యమం అనుభవాలను పంచుకున్నారు. కాగా, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు నష్టాలపై వడ్డే శోభనా దీశ్వరరావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంత పురం స్మార్ట్ మీటర్ల పోరాటయోధులను సత్కరించారు.

## పసుపు కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం దొంగాట

### కేవీవీ ప్రసాద్ విమర్శ

**విశాలాంధ్ర-విజయవాడ:** కొన్ని నెలల క్రితమే పసుపు పంట చేతికొస్తే...పసుపు కొనుగోలుకు ప్రభుత్వం ఇప్పుడు ఆదేశాలివ్వడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తప్పు పట్టారు. కేవీవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ సకాలంలో పసుపు కొనుగోలు చేయకపోవడంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కల్లాల్లోనే తడిసి ముద్దయిందని తెలిపారు. పసుపును ఇంతకాలం కొనుగోలు చేయకుండా ఆదరాబాదరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, జూన్ 12వ తేదీ వరకు మాత్రమే కొనుగోలు ఉంటుందని ప్రభుత్వం చెప్పడం బాధ్యతారహితమని విమర్శించారు. అదీగాక...కేవలం 20 వేల టన్నుల పసుపు కొమ్ములు మాత్రమే సేకరిస్తామని జీవోలో పేర్కొనడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. జూన్ 1వ తేదీన జీవో జారీ చేసినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని, అయితే సంబంధిత శాఖలకు ఇంతవరకు జీవో అందకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సమయం ముగుస్తున్నా సంబంధిత అధికారులకు జీవో కాపీలు అందకపోవడంతో వారం రోజుల్లోనే పసుపు సేకరణ ఎలా సాధ్యమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికోసం జీవో తేవటం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు రైతులను వదిలివేయడం దారుణమని తెలిపారు. పసుపు సేకరణ సమయాన్ని ఈ నెలాఖరు వరకు పొడిగించాలని, రైతుల వద్ద ఉన్న మొత్తం పసుపు కొమ్ములు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 11 మంది ఆచూకీ లేదు

### మిగిలిన వారంతా సురక్షితం- ఒక్కరు మృతి: మంత్రి అమర్నాథ్

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని, అయితే, పదుల సంఖ్యలో ప్రయాణికులకు గాయాలయ్యాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను ఒడిశా, ఏపీలోని వివిధ ఆసుపత్రులకు తరలించిన అనంతరం ముగ్గురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ అధికారులతో మంత్రి అమర్నాథ్ ఉన్నతస్థాయి సమీక్ష ఆదివారం బాలాసోర్‌లో నిర్వహించారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో రాష్ట్రానికి చెందిన 309 మంది ప్రయాణించారని, ఏపీ నుంచి హౌరా వైపు 33 మంది ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఈ 342 మందిలో 330 మందిని గుర్తించా మని, ఒకరు చనిపోయారని పేర్కొన్నారు. ఇంకా 11 మందిని గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు. గుర్తించిన వారిలో 14 మంది క్షతగాత్రులని, వీరిలో 10 మంది రిజర్వేషన్ బోగీలో, నలుగురు జనరల్ బోగీలో ఉన్నారని చెప్పారు. జనరల్ బోగీలో ప్రయాణించిన గురుమూర్తి అనే వ్యక్తి మరణించారని అమర్నాథ్ వెల్లడించారు. ఇంకా గుర్తించవలసిన వారి వివరాల కోసం అధికారులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, ఏలూరులో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లలో తమ వారు కనిపించడం లేదని ఇప్పటివరకు ఎవరూ రాలేదన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రానికి చెందిన 16 అంబులెన్సులను, 10 మహాప్రస్థానం వాహనా లను భువనేశ్వర్‌లో అందు బాటులో ఉంచామని, మరో ఐదు అంబులెన్సులను బాలాసోర్ వద్ద సిద్ధంగా ఉంచామని చెప్పారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొంతమందిని భువనేశ్వర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించామని, ఇద్దరిని విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి, ఒకరిని విశాఖ ఆరిలోవలోని అపోలో ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

## ఆనం రమణారెడ్డిపై దాడి అనాగరికం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డిపై పట్టపగలు దాడికి పాల్పడిన ఘటనను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే దాడులకు పాల్పడటం అనాగరికం, అప్రజాస్వామికమని, సైకో చర్యలకు సమాధికట్టే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. జగన్ తీరు చూస్తుంటే జర్మనీలో నాజీల దురాగతాలు గుర్తొస్తున్నాయని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విమర్శించడం నేరమా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని వేధించడం, అణచివేయడమే లక్ష్యంగా జగన్ పాలన సాగుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలవుతుందా అని హైకోర్టు పదే పదే ప్రశ్నించడమంటే రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. జగన్ తాత, తండ్రి వారసత్వ ఫ్యాక్షన్ రాజకీయాలను, దౌర్జన్యాలను, దోపిడీ విధానాన్ని కొనసాగిస్తూ రాష్ట్రాన్ని నేరగాళ్లకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. ఇలాంటి దాడులతో తమను భయపెట్టాలనుకోవడం జగన్ రెడ్డి పగటి కలేనని పేర్కొన్నారు. తమపై ఎన్ని దాడులు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల పక్షాన నిలబడతామని, ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో కొట్లాడుతామని స్పష్టంచేశారు. జగన్ దమనకాండకు ముగింపు పలికే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి.. ఆనంకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎగువ భద్ర, నవలి ప్రాజెక్టులు ఆపాలి

### 10 నుంచి రైతు గర్జన ప్రచార జాతా : జగదీశ్

**విశాలాంధ్ర-గుంతకల్లు :** ఎగువ భద్ర, నవలి ప్రాజెక్టుల నిర్మాణాన్ని కర్నాటక చేపడితే రాయలసీమ ఎడారిగా మారుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్ ఆందోళన వ్యక్తంచేశారు. రాయలసీమకు తాగు, సాగునీరు లేకుండా చేయడమే కర్నాటక లక్ష్యమని విమర్శించారు. కర్నూలు జిల్లా, గుంతకల్లులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగదీశ్ మాట్లాడుతూ ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం ఆపేయాలని, హెచ్ఎల్‌సీని ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. ఇవే డిమాండ్లతో ఈనెల 10వ తేదీ నుంచి 20 వరకు రైతుగర్జన ప్రచార జాతాను 32 మండలాల్లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాలలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రచారం చేస్తారని, రాయదుర్గం,కళ్యాణదుర్గం, రాప్తాడులో జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, అనంతపురం సింగనమల, తాడిపత్రి ప్రాంతాలలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి ప్రచారం చేస్తారని తెలిపారు. బొమ్మనహల్ హెచ్ఎల్‌సీ వద్ద ప్రారంభించే ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరవుతారన్నారు. సింగనమల, ఉరవకొండ, గుంతకల్లు ఏపీ రైతు సంఘం నాయకులు కేవీవీ ప్రసాద్, పి.రామచంద్రయ్య పాల్గొంటారని జగదీశ్ చెప్పారు. 21వ తేదీన రైతు గర్జన కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, టీడీపీ నేత పయ్యావుల కేశవ్, మాజీ మంత్రి కాల్వశ్రీనివాసులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, కాంగ్రెస్ నేత తులసీ రెడ్డి, జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పాల్గొంటారని తెలిపారు. ఈనెల 6,7 తేదీల్లో సీపీఐ సైద్ధాంతిత శిక్షణ తరగతులను గుంతకల్లు, బీరప్ప గుడి కళ్యాణ మండపంలో జరుగుతాయని, 7వ తేదీన కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బి.గోవిందు, నియోజవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

### లెనిన్ బాబు, జాఫర్ విమర్శ

**విశాలాంధ్ర బ్యూరో- అనం తపురం:** యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫల మయ్యాయని ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆదివారం యువజన సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. వైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లెనిన్‌బాబు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి ఉద్యోగాల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం నేటి యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే రైల్వే, ఇతర ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. నూతన విద్యా విధానం నెపంతో డార్విన్ సిద్ధాంతంతో పాటు ప్రజాస్వామ్యం, పౌరుల హక్కులు తదితర అంశాలను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించి విద్య కాషాయీకరణకు బీజేపీ పాలకులు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకెళుతుంటే భారత్‌లో మూఢనమ్మకాలు పెంచేలా తిరోగమన చర్యలు చేపడుతున్నారని వ్యాఖ్యానించారు. గ్రూప్ 1,2 ఉద్యోగాలతో పాటు ఎస్సై, కానిస్టేబుల్, మెగా డీఎస్సీ ద్వారా 50వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేనిపక్షంలో అన్ని విద్యార్థి యువజన సంఘాలతో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని లెనిన్‌బాబు హెచ్చరించారు. జాఫర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటాల్లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. అనంత పురం జిల్లాకు తాగు, సాగునీటి సాధన కోసం జరిగే పాద యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమిస్తామన్నారు. యువతకు ఉద్యోగం, ఉపాధి, నూతన పరిశ్రమల సాధన, తాగు-సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్ర మంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రాము, ధనుంజయ, యోగేంద్ర, నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు దేవా, శ్రీకాంత్, నిఖిల్, నవీన్ చౌదరి, సాయి, అలీ పాల్గొన్నారు.

## 11న మోడల్ స్కూళ్ల ప్రవేశపరీక్ష

**విశాలాంధ్ర-విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు ఏపీ ఆదర్శ పాఠశాలల సంయుక్త డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈనెల 11న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. apms.apcfss.in వెబ్‌సైట్లో హాల్‌టికెట్లు పొందవచ్చని విద్యార్థులకు సూచించారు.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల్ని గద్దెదించాలి

### రామానాయుడు పిలుపు

**విశాలాంధ్ర- చిత్తూరు:** భారత రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామానాయుడు పిలుపునిచ్చారు. సీపీఐ చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం చిత్తూరులోని ఎస్టీయూ కార్యాలయంలో పార్టీ నగర కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఒడిశాలో రైలు ప్రమాద మృతులకు సమావేశం నివాళులర్పించారు. అనంతరం సమావేశ అజెండాను, పార్టీ కార్యక్రమాలను జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు తెలిపారు. రామానాయుడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీల నాయకులపైన, వాస్తవాలను ప్రతిబింబింపజేసే మీడియా పైనా అక్రమ కేసులు బనాయిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర ధరలను అదుపు చేయలేని, రైతులకు గిట్టుబాటు ధర కలిగించలేని, ప్రజల సమస్యలను పరిష్కరించలేని ఈ ప్రభుత్వాలను గద్దె దించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు టీ.జనార్దన్, దాసరి చంద్ర, కె.విజయ గౌరీ, ఎస్.జయలక్ష్మి, పి.మార్ కొండయ్య, రమాదేవి పాల్గొన్నారు.

## చిన్న పత్రికల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్ ) :** అక్రిడిటేషన్ మంజూరు చేసే విషయంలో ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పత్రికల గొంతు నొక్కుతోందని ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారులు అంబటి ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం సామ్నా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం గాంధీనగర్‌లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన అంబటి మాట్లా డుతూ చిన్న, మధ్య తరహా పత్రికలకు ఇచ్చే అక్రిడిటేషన్లను తగ్గించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ వింతైన నియమ నిబంధనలు విధిస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమం పట్టని ప్రభుత్వంపై ఉద్యమం చేసేందుకు ఈనెల 13న విజయవాడలో సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రణాళికపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ సమాచార, పౌర సంబంధాల శాఖ జర్నలిస్టులకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని, అక్రిడిటేషన్ల సంఖ్య తగ్గించేందుకు అధికారులు కొత్త నియమావళిని రూపొందించారని విమర్శించారు. మండల స్థాయి అక్రిడేషన్ల మంజూరుకు సర్క్యులేషన్ పరంగా నిబంధనలు విధించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కొత్త జిల్లాలలో సామ్నా ప్రాతినిధ్యం కలిగి ఉండే దిశగా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పత్రికల పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలపై ఏపీయూడబ్ల్యూజే చొరవ తీసుకొని పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. గతంలో చిన్న పత్రికల ప్రచురణ 10 సంవత్సరాలు నిర్వహించి, ప్రస్తుతం పీడీఎఫ్ పత్రికలను నడుపుతున్న సీనియర్ జర్నలిస్టులకు వారి సీనియారిటీ ఆధారంగా అక్రిడేషన్లు మంజూరు చేయాలని సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా చిన్న పత్రికల వారికి జిల్లాలో 1+1 చొప్పున అక్రిడేషన్ మంజూరు చేస్తూ అందులో ఒకటి స్టేట్ అక్రిడేషన్ ఉండేవిధంగా చూడాలని తీర్మానం చేశారు. ఐటీ రిటర్న్ నిబం ధనను ఎత్తివేయాలని తీర్మానించారు. చిన్న పత్రికలకు నియోజక వర్గానికి ఒక అక్రిడిటేషన్ మంజూరు చేసే విధంగా చూడాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన అనేక మంది చిన్న పత్రికల ప్రతినిధులు తమ తమ సమస్యలను వివరించారు. చివరగా సామ్నా విజయవాడ నగర అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

### ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ సమావేశం అధ్యక్షుడు యేచూరి శివ అధ్యక్షతన విజయవాడ గాంధీనగర్‌లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు, ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గంతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొర్లపాటి ప్రదీప్ కుమార్, బాబు, రమేష్, కూర్మరావు తదితరులు పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియే షన్‌ను సంస్థాగతంగా పటిష్ట పర్చాలని, కొత్త జిల్లాలకు, ప్రాతినిధ్యం లేని జిల్లాలకు రాష్ట్ర కార్యవర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడి యాకు జిల్లా కేంద్రాలలో 2+2 అక్రిడిటేషన్ కల్పించాలని, స్థానిక కేబుల్ నెట్ వర్క్‌లో ప్రసారం అవుతున్న న్యూస్ ఛానల్ రిపోర్టర్లకు కూడా అక్రిడిటేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ఆమోదించారు. అనంతరం ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయు లును రాష్ట్ర అధ్యక్షుడు యేచూరి శివ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## పులివెందులలో శ్రీకృష్ణ దేవరాయల శాసనం

### ఈమని శివనాగిరెడ్డి

**విశాలాంధ్ర-పులివెందుల:** కడప జిల్లా పులివెందులలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు క్రీ.శ.1509 అక్టోబర్ 24వ తేదీన స్థానిక రంగనాథుని అంగరంగ భోగాలు, నైవేద్యానికిగాను కుందలూరు గ్రామాన్ని దానం చేసిన శాసనం నిర్లక్ష్యానికి గురైందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు. పులివెందుల రంగనాథస్వామి ఆలయంలో ఉండాల్సిన ఈ శాసనాన్ని పరిశీలించేందుకు ఆయన శనివారం వెళ్లగా... అది ఎక్కడుందో తమకు తెలియదని పూజారి చెప్పారు. అయితే

స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఊరి వెలుపల ఒక చెట్టుకింద ఆ శాసనాన్ని గుర్తించారు. ఆ శాసనం పక్కనే కూర్చొని ఉన్న రైతులకు శాసనం చారిత్రక ప్రాధాన్యతను వివరించి రంగనాథస్వామి ఆలయానికి కానీ, పులివెందుల పట్టణ పార్కుకు గానీ తరలించి భద్రపరచాలని శివనాగిరెడ్డి వివరించారు. శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషిక్తుడైన తరువాత విడుదల చేసిన తొలి తెలుగు శాసనం పులివెందులలో ఉండటం గర్వకారణమని, శాసన పాఠాన్ని ఇప్పటి లిపి, భాషలో రాయించి ప్రదర్శించాలని ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ అటవీ శాఖాధికారి చంద్రమోహన్‌రెడ్డి, శిల్పారామం సీఈవో శ్యాంసుందరరెడ్డి పాల్గొన్నారని శివనాగిరెడ్డి తెలిపారు.

## పద్మశాలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం:** రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఉన్న సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జి.విజయలక్ష్మి అన్నారు. ఆదివారం విశాఖలోని నాయుడు తోటలో అసోసియేషన్ రాష్ట్రస్థాయి ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పద్మశాలి కులానికి అత్యంత ప్రాధాన్యత కల్పించిందని, చేనేత కార్మికులను కూడా ఆదుకోవడంలో అన్ని విధాల ముందంజలో ఉందన్నారు. నేటికీ పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల సమస్యలపై సీఎంతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. రాష్ట్ర ఆప్కో సంస్థ చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ... పద్మశాలి ఉద్యోగులంతా అసోసియేషన్ గా ఏర్పడి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.వెంకట శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కుల సంఘం పెద్దలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. రంగ జనార్ధన్, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి కె వి సత్యనారాయణ, కోశాధికారి టీ.చంద్రశేఖర్, విశాఖ జిల్లా వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు మోహన్ మురళి, సెక్రటరీ పి.సత్యానంద్, వైస్ ప్రెసిడెంట్ ఆకుల విశ్వేశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు నీలం జోగరాజు, కార్యదర్శి చుక్కల కరుణాకర్, జీవీఎంసీ ఏసీపీ ఐవి రమణ మూర్తి, జీవీఎంసీ ఏపీఆర్ఓ నాగేశ్వరరావు, ఉద్యోగులు, కుల పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ రమ్య, శ్రీ లిఖిత చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో విశేష సేవలందిస్తున్న ఉన్నత అధికారులతో పాటు పదవ తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులతో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# తాపీ ధర్మారావు హేతువాద జిజ్ఞాస

## సాహితి

డా॥ కత్తి పద్మారావు
సెల్ : 9849741695

సంఘానికి పట్టిన మకిలిని వదిలించడానికి, భాషకు పట్టిన మడ్డిని తుడిచి వేయడానికి, భావాలకు పట్టిన చీడను దులిపివేయడానికి, సంస్కృతికి పట్టిన జిడ్డును కడిగి వేయడానికి, బ్రతుకంతా కుతకుత, ఉడికి కొత్త పాళీతో కొత్త భావాలు తెలుగు గుండెలకు అందించిన వాడు. కొత్తగొంతుతో కొత్తకూతను ఎలుగెత్తిన అభ్యుదయ రచయిత తాపీ ధర్మారావు. "చచ్చిన నియమాలతో, పుచ్చిన సంప్రదాయాలతో, దడదడ కవిత్వాల వేలం వెర్రితో, బండిరా (ఱ) ల, అరసున్నల (ఁ) బిగింపులతో, తెలుగు సాహిత్యం గాసట బీసటగా ఉన్న నాడు, దాని అంతరాలలోకి వెళ్ళి పరిశీలించి, పిట్టకలాలను పారద్రోలి, కొత్త కలాలకు, కొత్త సూత్రాలకు కొత్త దారులు తెలిపిన విమర్శకుడు తాతాజీ." సంస్కృత సమాజ వ్యామోహాన్ని నిరసించి, తెలుగు పలుకుల, తెలుగు పలుకుబడుల, తెలుగు మాండలీకముల తీయందనాలను దోసిళ్ళకొద్ది అందించాడు. తెలుగు మాటల శక్తి పసదనాన్ని రాశులు బోశాడు. సాహిత్యం జాతి జీవితానికి ప్రతిబింబం అన్న ముఖ్య సూత్రంతో ముందుకు నడిచాడు తాతాజీ.

**తాపీ వారి హేతువాదం:**

ధర్మారావు బహుగా శ్రమించి, భారతీయ సాహిత్యమే కాక, రష్యా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లాండు, అమెరికాదేశాలలోని మిక్కిలిఉత్తమమైన గ్రంథాలు, కరువు తీర చదివారు. 'అందువలన మూడు సంవత్సరాల లోను నేను దగ్గర దగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవ గలిగాను' అని తెలిపారు. చదవడమేగాక విమర్శించు కొన్నారు. తర్కించుకొన్నారు. మనస్సుకు పట్టించుకొన్నారు. వాటి సారాన్ని గ్రంథాల ద్వారా, వ్యాసాల ద్వారా, నాటికల ద్వారా, విమర్శనల ద్వారా, పరిశోధనల ద్వారా, కథల ద్వారా, తెలుగు ప్రజలకందించాడు. కవి అన్న వాణ్ణి ప్రజల భాషలో, ప్రజల కోసం బతకమన్నాడు.

"ప్రజల కవివై గొంతు/ రగిలించి పాడితే
ఒక్క డొక్కలురేగి ప్రళయ మారుతమట్లు
తక్కువెక్కువ లెల్ల ఒక్క దెబ్బను కూల్చి
లోకాలనూగింపవా!
ఓ కవీ/శోకాలు తొలగింపవా!"

అని ప్రజల గుండెలు రగిలి, లోకాన్నే మార్చుకో గలిగిన చైతన్యం ప్రజలకు కలిగించమన్నాడు.

"మండుటాకులలోను/ఎండకు నాల్కలలోను
మొండిబారిన పేద బండ గుండెలలోను
గాండ్రించు భావాల నిండించి నీ గొంతు
సింహనాదము చేయరా
ఓ కవి/స్థిరమైన పేర్మోయరా"

ఆకలి సొదలో నుంచి సింహనాదాలు పుడతాయని, విప్లవాలు పుడతాయని అయితే వాటికి ప్రేరణ కలిగించేవాడు కవి అని సందేశం ఇవ్వగలిగాడు.

**తాతాజీ జ్ఞాన జిజ్ఞాస:**

తాతాజీ ఎవరూ తడమని, ఎవరూ వివరించడానికి పూనుకోని అంశాలను పరిశీలించారు. సాహితీ విమర్శలో కొత్తపుంతలు తొక్కారు. ఆంధ్ర సాహిత్యాన్ని ఆమూలాగ్రంగా ఆయన పరిశీలించారు. ప్రబంధ సాహిత్యంలో అన్వయ క్లిష్టమైన సాంప్రదాయ పండితులకు సహితము కొరుకుడుపడని చేమకూర విజయ విలాసానికి హృదయోల్లాస వ్యాఖ్య సహృదయ రంజకంగా చేశారు. కవి సార్వభౌములుగా, పండిత ప్రకాండులుగా పేరుపొందిన వారికెవ్వరికి తీసిపోని భాషా సంపద ఆయన చేతిలో వుంది. ఎంతటి క్లిష్టమైన విషయాన్నయినా పండితుని దగ్గర నుండి ప్రజా సామాన్యం వరకు పనస తొనల్లా వొలిచి పెట్టడం ఆయన విశిష్టత. అసత్యాన్ని వేటాడడం ఆయన వృత్తి, గతంపై విప్లవం చేయడం, భవిష్యత్తుకు విజయం చేకూర్చడం ఆయన ప్రవృత్తి.

లేకపోతే తరతరాల దేవాలయ సంస్కృతిలో అనాగరికతకు చిహ్నంగా నిలబడిన 'దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు' అని ప్రశ్నించినవారు ఎవరు? బూతుకి దేవాలయానికి వున్న అనుబంధాన్ని వివరించిన వారు ఎవరు? గుడి గర్భాన్ని పరిశీలించిన వారు ఎవరు? గర్భగుడికి, గర్భాదానానికి ఉన్న సంబంధాన్ని విప్పి చెప్పినవారెవరు? గోపురాల మీద, రథాల మీద, గర్భగుడి విమానాల మీద, కోవెల గోడల మీద లక్షల సంఖ్యలో వున్న బూతు బొమ్మలు ఏ నాగరికతకు, ఏ సంస్కృతికి ప్రతీక అని నిలదీసిన వారెవరు? యజ్ఞాలలో దాగున్న బహిరంగ సంభోగాలను, యాగాలలో దాగున్న పశు సంపర్కాలను, పూజలలో దాగున్న బూతు విధానాలను, పండగల పేరుతో జరిగిన అనాగరిక సమ్మేళనాలను వాటి మూలాల్లోకి వెళ్ళి వివరించిందెవరు?

భారతదేశ చరిత్రను, నాగరిక మూలాలను మాతృ స్వామ్య వ్యవస్థ నిర్మాణాన్ని, సామాజిక శాస్త్రాలను, మత



పౌరాణిక సర్వస్వాలను, జాతి కుల భేదాల పుట్టుకలను, మనస్తత్వ శాస్త్రాలను, స్త్రీ పురుష సంబంధ తత్వాలను, మానవ పరిణామ చరిత్రను అధ్యయనం చేసి హృదయానికి పట్టించుకొని మేధస్సుతో తర్కించుకొని ప్రజా సామాన్యానికి సులభమైన సరళమైన తెలుగులో అందించినదెవరు?

సామాజిక ధర్మం కోసం పోరాటం చేసిన ధర్మారావు గారు కాదా! ఈ పోరాటం కోసం ఎంతమంది మేధావుల రచనల్ని ఆయన పరిశీలించారు. LARDY AVEBURY - DR. JAMES HOSTINGS, ROBERT BRIFFAULT EDGAR THURSTON, ERNEST CROWLEY - E.A WESTERMARK, ABBE DUBOIS - O..WALL, SIR. J.G FRASER - JOHN WOODROFFE, E.S.HARTLAND - ERTIC JOHN DINGWALL, WILLIM G. SUMMER - GEORGE R. SCOTT.

వీరందరూ ఆయన తరపున చారిత్రక సాక్ష్యాన్ని ఇచ్చి ఆయన నినదించిన సత్యానికి బాసటగా నిలచిన వారే.

**తాపీ వారి హేతు ప్రజ్ఞ:**

తెలుగు ప్రజలకు కొత్త సత్యాలను అందించడానికి, కొత్త ఆరోగ్యాన్ని చేకూర్చడానికి, కొత్త జవసత్వాలను నింపడానికి ఆయన చరిత్ర గర్భంలో చొచ్చుకుపోయి ఎంత పరిశోధన గావించారో దేవాలయాలపై బూతు బొమ్మలు చాటి చెపుతోంది. ఆయన ఈ పరిశోధన మూఢ విశ్వాస వన కుఠారమై ప్రవర్తిల్లింది.

గూడవల్లి రామ బ్రహ్మం సంపాదకత్వాన వెలువడిన 'ప్రజామిత్ర'లో ఈ వ్యాసాలు ప్రచురితమై మూఢ విశ్వాసాల పునాదులను కదిపినాయి. పాత రాతి యుగంనాటి ఆచారాలపై ఎందుకు? అనే ప్రశ్న విచక్షణతో పొటమరించింది. ఆధునిక విజ్ఞాన శాస్త్రాలకు నమూనాలు వెదుకుతున్న కుహనా మేధావుల పుర్రెకు కొర్రు పడింది. క్రైస్తవ మిషనరీలు, మా చర్చీలు పవిత్రమైనవని బోధిస్తుండగానే, ఆ చర్చిలు గుడిచేటివాళ్ళకు నిలయమనే చారిత్రక సత్యం రోడ్డుకొచ్చింది. మందగా విచక్షణా రహితంగా, ఏది చెప్పితే అది వినే ఈ జాతికి ఆలోచన రేకెత్తింది. గతాన్ని, మతాన్ని పరిశీలించాలి అనే జిజ్ఞాస కొందరిలోనయినా పొటమరించింది. సమాజం మారుతుంటే సమాజంలో వున్న ప్రతి అంశం మారుతుందనే. అలాగే 'పెళ్ళి' సంగతి కూడాను. ఆదిలో పెళ్ళిళ్ళు ఈనాటి పెళ్ళిళ్ళ లాగా పురోహితుల మంత్రాలతో, అగ్నిసాక్షిగా 'నాతిచరామి' అన్న ప్రమాణాలతో జరుగుతూ వుండేవని అంటే నలుగురూ నవ్వుతారు. పెళ్ళికి సంబంధించిన అభిప్రాయాలు, ఆచారాలు అంచెలంచలుగా మారుతూ వచ్చాయి.

జతకట్టడానికి, పెళ్ళికి ఉన్న తేడాను చారిత్రకంగా నిరూపించడం చాలా అవగాహనతో కూడుకున్న పని. జతకట్టడమనేది ప్రకృతికి సంబంధించిన విషయం. ప్రకృతి సిద్ధం. ప్రకృతిలో అంతర్లయగా పశు పక్ష్యాదులన్నిటిలో ప్రవహిస్తున్న విషయం. ప్రకృతి ప్రగతికి ఆది మూలం. పెళ్ళి కృత్రిమమైన విషయం. పెళ్ళి పేరుతో ఒక వ్యక్తి భావాలకు, కోరికలకు ఇనుపకచ్చడాలు కట్టడం కృత్రిమ సామాజిక కల్పనం. పెళ్ళి సంకుచితంగా, స్వేచ్ఛారహితంగా మారిపోవడం, పెళ్ళిలో భిన్న ఆచారాలు, భిన్న సంప్రదాయాలు, భిన్న పద్ధతులు ఉండడమే పెళ్ళిని సమాజం కృత్రిమంగా నిర్ణయించు కున్నదని అర్థమవుతోంది. మాతృస్వామ్య వ్యవస్థలో స్త్రీకున్న స్వేచ్ఛ, హక్కు, బాధ్యతపోయి పితృస్వామ్య వ్యవస్థలో బానిసత్వం, దాస్యం స్త్రీకి అలంకారాలుగా చెలామణి అయ్యాయి. పెళ్ళి అనే దాని స్వరూప స్వభావాలు సమాజానికి రాను రాను అంతుబట్టక దానిలో చాలా వికృతాలు వచ్చాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనాలు ఈ దురవగాహనకు ఫలితాలు. భర్తకు భార్యను అమ్ముకునే హక్కు, కన్యాశుల్కాలు పెట్టి కొనుక్కునేహక్కు వంటి వ్యాపార సరళికి పెళ్ళి దిగజారడం ఈ అవగాహన వల్లనే. ఈనాటి పెళ్ళంటే పెద్ద వ్యాపారం. కులానికొకరేటు, డిగ్రీకి ఒక రేటు ఇచ్చి ఆడపిల్లలు మగపిల్లల్ని కొనుక్కోవడం ప్రేమ, అనురాగం, మానవత్వం ఏవీ పెళ్ళనే తంతుకు మూలంగా ఈనాడు లేవు. పెళ్ళి జరగడంలో కృత్రిమత్వం పెరిగే కొద్ది కాపురాలలో కూడా విపరీతమయిన కృత్రిమత్వం కనిపిస్తుంది.

పూర్వం మనం సాంప్రదాయకంగా చేసుకున్న పెళ్ళిళ్ళన్నీ కృత్రిమాలే. వరుడికి ఇష్టం లేకుండా కట్టడాన్ని బ్రహ్మ వివాహమన్నారు. కన్యాదాత వరుడ్ని పక్కనే కూర్చోపెట్టి పురోహితుడికి దానమిస్తే దైవ వివాహ మన్నారు. రెండు జతల గోవుల్నిచ్చి కన్యను చేసుకోవడం ఆర్ష వివాహమన్నారు. వరుణ్ని ఒప్పించి ఇవ్వడాన్ని ప్రజాపత్యమన్నారు. డబ్బిచ్చి కన్యను కొనుక్కొవడం అసురమన్నారు. బలాత్కారంగా లేపుకెళ్ళడం రాక్షస మన్నారు. నిద్రలో నున్నప్పుడు బలాత్కారంగా జతగూడడం పైశాచికమన్నారు. వధూవరులు ఇష్టపడి చేసుకుంది ఒక గాంధర్వం మిగిలిన వివాహ పద్ధతులన్నీ కృత్రిమమైనవే. దౌర్జన్యం, బలాత్కారం, అమ్ముకోవడం, కొనుక్కోవడం మన సంస్కృతిలో పెళ్ళిగా చెలామణి అయ్యింది. ఈనాటికి ఈ పద్ధతులలోనే సంప్రదాయం పేరుతో పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. తాపీ ధర్మారావు గొప్ప హేతువాది, మానవతా వాది, సమతావాది కులమత బేధాలు లేని గొప్ప మనిషి, బ్రాహ్మణవాదం మీద తిరుగులేని కత్తి విసిరాడు.

---

## రాళ్లు

-కేశవ్ గోపాల్
సెల్: 7989001058

రాళ్లు...రాళ్లు...రాళ్లు
మా ఊరంతా రాళ్లమయం!
నల్లరాళ్లు, తెల్లరాళ్లు
పలకరాళ్లు
చిత్ర విచిత్రమైన
రకరకాల రాళ్లు!
రాళ్లు కొట్టుకుని
బతికేవాళ్లూ
రాళ్లకు ప్రాణం పోసే వాళ్లూ
మా ఊళ్లో ఉన్నారు
డొక్కలు మాడ్చుకుంటున్నారు!
అంతేకాదు...
రాళ్లతో వ్యాపారం చేసి
రాళ్లను రూపాయలుగా
మార్చుకుంటున్న వాళ్లూ
బొక్కసాలు
నింపుకుంటున్న వాళ్లూ
రాతి గుండెల దుండగులూ ఉన్నారు!
భాగ్యవంతులు
భవంతులు నిర్మించినా
నిర్భాగ్యులు రేతిరి
విశ్రమించినా
అవే రాళ్లు అవే రాళ్లు
బండరాళ్లు...!
రాయీ రాయీ
ఎందుకు మాట్లాడవంటే-
నా గుండెలు
పగలగొట్టారు గదా...
నేనెట్లా మాట్లాడేది...?
ఇది దాని జవాబు!-మరి
మనిషి జవాబేదీ...???

---

## ఏకాగ్రత చెదరనీకు

ఎస్.ఆర్.పృథ్వి
సెల్: 9989223245

మనిషి ఏకాగ్రతను ప్రేమిస్తే
మంచి కార్యాల వైపు నడిపిస్తుంది
అదే ఏకాగ్రత చెదిరితే
మనిషైనా, దేశమైనా సరే
గందరగోళం ఆవహిస్తుంది
మనసును ఎంత అదిమిపట్టినా
మాట వినని గోలే
నల్లని మబ్బులా కమ్మేస్తుంది
శిరస్సు వ్రయ్యలవుతున్నట్టు
మెదడులో వింత కలలు
అంత మాత్రాన శిరస్సు తెగ్గోసుకుంటామా!
వైద్యాన్ని ఆశ్రయించి,
మళ్లీ చిరునవ్వును ఆహ్వానిస్తాం
దేశమైనా అంతేగా!
ఎవరికైనా సరే, సమగ్రతని
దెబ్బతీసే అవసరం కలిగిందంటే
దాని వెనుక స్వప్రయోజనం
శివ తాండవమౌతుంది, లేదా
స్వార్థ రాజకీయం కళ్లు విప్పతుంది
స్వార్థముంది చూశారూ
మనసులో దూరే అవకాశమిస్తే
చెడు తరంగాలను దాచి
తీపై విస్తరిస్తుంది.
మంచి ఆశయాలను తరిమేసి
కొత్త ఆశలకు శ్రీకారం చుడుతుంది
'నాది' అనే అహాన్ని
ఊడల మర్రిని చేస్తుంది.
నీతి విత్తులు మొలకలవ్వకుండ
నేలలోనే అడ్డుకుంటుంది
జాతి విచ్ఛిన్నానికి
ప్రణాళికలు అల్లుతుంది
అవినీతిని సముద్రం చేసి,
మానవత్వం మీది కుసుగొల్పుతుంది
తస్మాత్ జాగ్రత్త!



సమాజం మీద కురుస్తున్న
ముళ్ల వానను ఆపేందుకు
ఏకాగ్రతను ఆయుధం చేసుకో
మనసు చుట్టూ, అవినీతిని అడ్డగించే
ఉక్కు కోటను నిర్మించు
నీ రూపమప్పుడు
ఎగురుతున్న దేశ పతాక అవుతుంది.

---

## నేలతల్లి కన్నీటి గోడు

గ్రంథ సమీక్ష

"ఈ భూమికి పచ్చపచ్చని రంగులద్దే కృషీవలుని మించిన కళా కారుడెవరు? మనిషి సజీవతకు సారాన్ని అందిస్తూ చెమట చిత్తడికి చైతన్య రూపమైన సైనికుని మించిన సేవాతత్పరుడెవరు? మట్టిలాలనలో రక్తాన్ని స్వేదంగా మార్చి

మొలకెత్తే విత్తుకు సేవలందించే
సేద్యగాణ్ణి మించిన శ్రమజీవి ఎవరు?
ధ్వంసమౌతున్న హరిత స్వప్నాన్ని
ఓర్పుతో నేర్పుతో రక్షించుకుంటూ
ఛిద్రమవుతున్న చిరునవ్వులను
ఆనందాన్వేషీనిస్తూ ధర్మనిష్ఠతో బతికే
ధరణీ నేస్తం రైతుగాక మరెవరు?"

నేలతల్లి ముద్దు బిడ్డయిన రైతు సజీవ రూపాన్ని సజీవ భాషలో వర్ణించిన పై పాదాలు చదువుతుంటే నిత్యం భూమిపూజ చేసే కోట్ల మంది రైతులు నా కళ్ళ ముందు కదిలాడారు. నేలను దున్ని అన్నాన్ని మొలకెత్తించే అన్నదాతల నాగళ్ళు, చాళ్ళను సింగారిస్తూ కన్పించాయి. మనుషుల చిరునవ్వుల్ని పంటచేలో చూచుకుని పరవశించే సేద్యగాళ్ళ ఆశలు, ఆకాంక్షలు మన గుండెల్ని తట్టిలేపి, ఒక్కసారి పొలంగట్ల మీద నడవ మంటాయి పై పాదాలు. సృష్ట్యాది నుండి మనిషి మనుగడకు మూలస్తంభంగా నిలిచిన వాడు రైతు. నేలను దున్ని మట్టి నుండి అన్నాన్ని బయటకు తీసిన తొలి శాస్త్రవేత్త రైతు. నాగేటి చాళ్ళలో దేశ భవిష్యత్తును చూయించిన తొలి దార్శనికుడు రైతు. తాను తింటూ పది మందికి పెడుతూ అందరూ సుఖంగా బతకాలని కోరుకునే తొలి సమ సమాజ సిద్ధాంతకర్త కర్షకుడు.

ఒకప్పుడు రైతేరాజు. రాజుల కాలంలోనూ రైతు పూజలందుకున్నాడు. అన్నం తినే ప్రతివాడూ రైతును గౌరవంగా చూసేవాడు. కాలం మారింది. జీవితపు విలువలూ మారాయి. గ్రామీణ వృత్తులు తారుమారయ్యాయి. అందర్నీ కాపాడే కాపుగా, దేశాభ్యుదయానికి కాపుగా నిలిచిన రైతు మారిన పరిస్థితుల్లో నిలువ నీడలేని వాడయ్యాడు. అందరి గోడునూ ఆలకించిన అన్నదాతే తన గోడును వినమంటూ రోడ్డెక్కాడు. కాడి, మేడి మూలన పడ్డాయి. ప్రభుత్వాల కనికరం కరువైంది. కర్ణుడి చావుకు వంద కారణాల న్నట్లుగానే శతానేక సమస్యలు రైతును చుట్టుముట్టి సేద్యానికి పొగపెట్టాయి. తన బిడ్డకు దాపురించిన కష్టాన్ని చూచి నేలతల్లి కన్నీళ్ళు కారుస్తుంది. నేలతల్లి కన్నీటి గోడును "నాగేటిగోడు" గా మనకు విన్పిస్తున్న కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి. కనిగిరి సీమ కన్నీటి గోడు తెలిసిన కొండ్రెడ్డి కలం తనదైన "దుక్కిచూపు"తో తలగుడ్డల దుఃఖాశ్రువుల్ని సరికొత్త కథాకావ్యంగా ఆవిష్కరించింది.

కొండ్రెడ్డి వారు మా ప్రకాశం జిల్లా వర్తమాన కవుల్లో అగ్రగామి. టీచర్‌గా, హెడ్మాష్టర్‌గా, విద్యాధికారిగా విద్యారంగ వికాసానికి విలువైన సేవలం దించారు. ఉద్యోగంలో వుంటూనే కవితా వ్యవసాయం ప్రారంభించిన కొండ్రెడ్డి కరువు సీమ కనిగిరిలో మంచి కవిత్వాన్ని పండించారు. నదీ ప్రవాహంలా సాగిన వారి సాహిత్య ప్రస్థానంలో మలుపులున్నాయి. గెలుపు లున్నాయి. అందుకున్న అవార్డులు, పొందిన పురస్కారాలున్నాయి. కొండ్రెడ్డి నిబద్ధతతో కవిత్వం రాసిన అనిబద్ధ కవి. సమకాలీన సామాజిక, సాహిత్య ఉద్యమా లన్నింటికీ సానుకూలంగా స్పందించిన వారి లేఖిని వస్తువైవిధ్యానికి చిరునామాగా నిలిచింది. నిష్పాక్షికమైన వారి వైమర్శిక దృష్టి ఉత్తమ సాహిత్య విమర్శకు అటపట్టయింది. కుందుర్తి వచన కవితా మార్గాన్ని మరింత విస్తరించి, కవిత్వాన్ని గ్రామీణులకు చేరువ చేసిన వారిలో కొండ్రెడ్డి ఒకరు. మా గురుదేవులు నాగ భైరవ కోటేశ్వరరావు ఆశీస్సులతో అక్షరాలకు సరికొత్త కాంతినిచ్చి తమ కలం పదునును నిరూపించుకున్నారు. అతి కొద్ది కాలంలోనే సాహితీ లోకంలో అజేయుడిగా అందరి దృష్టి నాకర్షించారు. నిత్యం పత్రికల్లోని సాహిత్యం పేజీల్లో పతాక శీర్షికగా కనిపించే కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి పరిచయమైన తొలినాళ్ళలో మిత్రునిగా, అనంతరం ఆత్మీయ సోదరునిగా, ప్రస్తుతం గురువర్యులుగా నాకు అభిమాన పాత్రులయ్యారు.

"రైతంటే అదును, పదునెరిగి
కురిసే శ్రామిక మేఘం" - అన్నారు. ఈ పాదాలు రైతు గుండె చప్పుడు తెలిసిన కొండ్రెడ్డి వారి కలానికి వర్తిస్తాయి. అదును, పదును తెలిసి కవిత్వమే పనిగా పాఠకుల గుండెలపై కురుస్తున్న కర్షక కవి కొండ్రెడ్డి. "పైరుకు పంట కిరీటాన్ని పెట్టి. బువ్వ విత్తుల్ని చల్లి మన ఆకలి తీరుస్తున్న అక్షరాన్నదాత కొండ్రెడ్డి."మట్టి భాష తెలిసిన రైతన్న బతుకు చెమ్మను ఆర్పుతూ, చెమట చెట్టుకు దోపిడీ చీడను పట్టిస్తున్న ప్రభుత్వ పెద్దల్ని నిలదీశారు ఈ కావ్యంలో. అన్నదాత బతుకు కునారిల్లి పోవడానికి కారకులైన అన్ని శక్తుల్ని ప్రశ్నలతో నిలదీశారు. నేలను నమ్ముకున్న రైతుకు నమ్మకద్రోహం అంటే తెలిసేలా చేస్తున్న కుట్రలన్నింటినీ బహిర్గతం చేశారు.

"దైవభక్తి ముసుగులో/ దేశభక్తిని విస్మరిస్తూ దోపిడీ శక్తిని సంస్మరిస్తున్న" నయవంచకులైన నాయకులకు కళ్ళు తెరిపించే నిజాలు చెప్పారు. రైతుల్ని విస్మరిస్తే అధికార పీఠాలు కదలక తప్పదని హెచ్చరించారు.

"మనిషి ఆర్థిక స్వార్థం వీడినపుడే
మట్టి అమ్మతనం అర్థమవుతుందన్నారు."
"అనుభవంలో
దుఃఖాన్ని చవిచూడని బతుకుండదం"టారు.
"గాయాన్ని ముద్దాడని ప్రేముండదం"టారు
స్వాతంత్ర్యం సిద్ధించి, అమృతోత్సవాలు
జరుపుకుంటున్నా-
"బడుగు బలహీన వర్గాల జీవితాలు
కంప మీద ఆరేసిన వస్త్రంలా
లాక్కోలేక, పీక్కోలేక
చివరకు చిరిగిపోతూనేవున్నాయ"న్న
కఠోర వాస్తవాన్ని మన ముందుంచారు.
"కష్టజీవికి ఇరువైపులా వుండేవాడే కవి" -
అని మహాకవి శ్రీశ్రీ వర్ణిస్తే- నేటి కవులంతా "కష్ట జీవుల్ని పట్టించుకోకుండా "పోస్ట్ మోడర్నిజం" ఊహల్లో ఉయ్యాలలూగుతున్న కవులు అవార్డుల కోసం పడిగాపులు కాస్తున్నారని నిర్వీతితో గళమెత్తారు.
ఇప్పటికైనా కవులంతా
"అన్నదాతను భవిష్యత్తుల్లోకి నడిపించే
బలోపేతమైన భావజాలంతో
పద్యాన్ని ఓదాన్ని అందుకుని
అంతరాత్మ దాహం తీర్చుకోవాలంటారు.

అవును. కవులు అంతరాత్మల్ని వెలిగించుకుని, అన్నదాతల ఆత్మక్షోభకు అంతిమ పరిష్కారం చూపాలి. సమాజానికి, జీవితానికి దూరంగా జరిగే సాహిత్యానికి ఎప్పుడో కాలం చెల్లింది.

"బతుకును బతికించుకోవడమే/బతుక్కి మనమిచ్చే బహుమానం" అంటున్న కొండ్రెడ్డి అద్భుతమైన అభివ్యక్తుల తార, పద చిత్రాలతో, గ్రామీణ పలుకుబడులతో రైతు జీవితాన్ని కథా కావ్యంగా మలిచారు. రైతు బతికితేనే సమాజం బతికి బట్టకడుతుందన్న పెద్దల మాటకు చద్దిమూట లాంటి చక్కని, చల్లని వ్యాఖ్యను పై పాఠాల్లో మనకు రుచిచూపారు.

"నాగేటిగోడు" కావ్యాన్ని ప్రారంభం నుండి చివరి వరకు ఏక బిగిన చదివి, ముగ్ధుడయ్యాను. చాలు తప్పని కోండ్రలా, జలపాతంలా సాగిన కొండ్రెడ్డి కవన ధారకు మురిసిపోయాను. కొన్నిచోట్ల కన్నీళ్ళు పెట్టుకున్నాను. ఇంకొన్ని చోట్ల కవితో పాటు నేనూ కన్నెర్ర చేశాను. మరికొన్ని చోట్ల పిడికిలి బిగించాను. సాటికవిగా రైతు బిడ్డగా ఇంత మంచి కథాకావ్యం రాయలేక పోయినందుకు సిగ్గుపడ్డాను. ఆనాటి కర్షక కవులు దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి, ఏటుకూరి వెంకట నరసయ్యల సరసన చేరటం చోటు సంపాదించిన మన కనిగిరి సీమ కర్షక కవి కొండ్రెడ్డిని చూసి గర్వపడ్డాను.

'నాగేటిగోడు' కావ్యంలో కొండ్రెడ్డి వారు రైతును ధీరోదాత్తునిగా, త్యాగమూర్తిగా పోరాట యోధునిగా నిలిపారు. రైతులతో గొంతుక కలిపారు. పంజాబ్, హర్యానా రైతుల అజరామర పోరాటాన్ని అక్షరీకరించారు. కష్టాలు, కన్నీళ్ళకు తలవంచని రైతు జీవితం వ్యక్తిత్వ వికాసానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. అక్షర యోధులైన కవులు కాలక్షేప కవిత్వానికి స్వస్తి చెప్పి, కర్షక కవిత్వానికి శ్రీకారం చుట్టాలనే గుండె నాదాన్ని వేదంగా, సామాజిక నినాదంగా విన్పిస్తుంది "నాగేటి గోడు" కావ్యం.

"భూమ్మీద సేద్యగాడు అంతరిస్తే
సూర్యుడు అస్తమించినట్లే - నన్న మహత్తర సందేశం ఈ కావ్యానికి మకుటంగా నిలుస్తుంది. ఈ కావ్యం చదివాక అన్నం ముద్దతో పాటు, బతుకును ముద్దాడటమూ తెలిసింది. ఎడారై పోతున్న మనస్సును, వెంటాడుతున్న తమస్సును, దృశ్యం అదృశ్యమై పోతుంటే స్వేచ్ఛా రహిత మనుగడ చెల్లని నాణెంలా గిరాటు వేయబడటాన్ని గుర్తించాను. ఈ కావ్యం చదివాకనే మట్టికున్న అమ్మతనం తెలిసింది. అన్నదాత అమరత్వం అవగతమైంది. మట్టిని గుప్పిట్లోకి తీసుకోగానే తాత, తండ్రుల శ్వాసలు విన్పించాయి. అమ్మ, నాన్నల ఆకారాలు కన్పించాయి. తరతరాలుగా తడి ఆరని నేలకన్నీటి తడి గుండెను ఆర్ద్రం చేసింది. మట్టి మౌన భాష నాకు సరికొత్త భూమి భాషను నేర్పింది. విశ్వమానవ జీవన కళా పారంగతులైన రైతుల రైతరికానికి వ్యాఖ్యానమే "నాగేటిగోడు". జనన ప్రయోజకత్వాన్ని ఆచరణలో నిరూపించుకునే అన్నదాత అంతరంగానికి అక్షర రూపం 'నాగేటిగోడు'. కొండ్రెడ్డి వారి మాటల్లోనే చెప్పాలంటే- "జీవితాన్ని / ఎన్నిసార్లు వ్యాఖ్యానించినా ఏదో మిగిలిపోతూనే వుంటుంది." 'నాగేటిగోడు' కావ్యం గురించి ఎంతరాసిన రాయవలసినదెంతో వుంటుంది. ఉత్తమ కావ్య లక్షణం కూడా అదే. అలాంటి ఉత్తమ కథా కావ్యాన్ని 75 ఏళ్ళ వయసులో మన కందించిన కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి బంగారు కలానికి పాఠకలోకం తరఫున సదా వందన మందారాలు.

డా. బీరం సుందరరావు, 6303443302.

# ఉప్పొంగిన మానవీయత

- రైలు ప్రమాద బాధితులకు ఎనలేని సాయం
- మృతదేహాల వెలికితీతలో సాహసోపేత ప్రదర్శన
- బాలాసోర్ ధైర్యవంతుల అలుపెరగని కృషి

**బాలాసోర్ :** ఒడిశా రైలు ప్రమాదం అత్యంత విషాద ఘటన. తమ కుటుంబంతో ఉత్సాహంతో సెలవులు గడిపేందుకు ప్రయాణిస్తున్న కొందరు. వ్యాపార, ఉద్యోగాల కోసం ఊరు దాటి వెళుతున్న మరికొందరు. అప్పుడే చీకట్లు కమ్ముకుంటున్న వేళ... తమ గమ్యం దగ్గరైందనుకున్న లోపే ఘోర దుర్ఘటన. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో బాలాసోర్ జిల్లా బహనాగ బజార్ స్టేషన్ సమీపంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ భారీ ప్రమాదానికి గురైంది. సిగ్నల్ వ్యవస్థలో తప్పిదం వందల మంది ప్రాణాలను గాలిలో కలిపేసింది. వెయ్యికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. అయితే ఈ విషాద సమయంలో బాలాసోర్ ప్రజలు ప్రదర్శించిన మానవీయత, అత్యంత ధైర్య ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే స్థానికులు పరుగులు తీసుకుంటూ ఘటనా స్థలికి చేరుకొని సహాయ చర్యలు ప్రారంభించారు. రైలు బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చి వారి ప్రాణాలు కాపాడారు. ఇక అప్పటికే చనిపోయిన వారి మృతదేహాలను వెలికితీసేందుకు ఎనలేని ధైర్యాన్ని ప్రదర్శించారు.

చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టిన తర్వాత అలోక్ శుక్లా తన ఇంట్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా 'చాలా పెద్ద శబ్దం' వినిపించింది. సమయాన్ని వృథా చేయకుండా అలోక్ వెంటనే రైలు ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ రక్తసిక్తమైన, వికృతమైన శరీరాలు ఒకదానికొకటి కప్పబడిన భీతావహ దృశ్యాలు అతనికి కనిపించాయి. ఆ ప్రదేశం అంతటా రక్తమే కనిపించింది. అయితే బాలాసోర్ స్థానిక నివాసితులు ప్రమాద స్థలానికి పరుగులు తీసి బాధితులకు సహాయం చేయడం ప్రారంభించారు. రైల్వే ట్రాక్‌లు దాదాపు ధ్వంసమై, బోగీలు ఒకదానిపై మరొకటి ఎక్కి ఉన్నప్పటికీ బాలాసోర్ ధైర్యవంతులు వందల మంది ప్రజలను రక్షించారు. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), ఒడిశా విపత్తు నిర్వహణ దళం (ఓడీఆర్ఏఎఫ్) బృందాలు అక్కడకు చేరుకునే సమయానికే ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను వారు రక్షించారు. ఆ చిమ్మ చీకటిలో స్థానికులు వారి మొబైల్ ఫోన్‌ల ఫ్లాష్‌లైట్‌లను ఉపయోగించి పెద్ద సంఖ్యలో మృతదేహాలను వెలికితీసేందుకు బోగీల్లోకి వెళ్లారు. అలాగే గాయపడిన వారిని వైద్య సహాయం కోసం ఆస్పత్రులకు తరలించేందుకు సాయపడ్డారు. 'రైళ్లు ఢీకొన్న తర్వాత అంతా చీకటిగా ఉంది. ప్రయాణికులు నొప్పితో ఏడుస్తున్నారు. నేను ఎల్94 సమీపంలో ఉన్నాను. బోగీలు ఒకదానికొకటి ఢీకొన్న సమయంలో పెద్ద పేలుడు వంటి శబ్దం వినిపించింది. ఇది హృదయాన్ని కదిలించే దృశ్యం. నాకు పెద్దగా అరుపులు వినబడ్డాయి. నేను బోగీల దగ్గర కుప్పలుగా మృతదేహాలను చూశాను. నేను, ఇతరులు బోగీ లోపలికి వెళ్లి చాలా మృతదేహాలను వెలికితీశాము' అని ప్రయాణీకులను రక్షించడానికి పరుగెత్తిన అలోక్ శుక్లా ఒక ఆంగ్ల వార్తా టీవీ ఛానెల్‌తో అన్నారు. ఈ భయంకరమైన ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలో అలోక్, అతని ఇద్దరు స్నేహితులు కంపార్ట్‌మెంట్లలోకి ప్రవేశించిన మొదటి వ్యక్తులు. బహనాగా స్టేషన్‌లోని రైలు ట్రాక్‌కి ఆనుకుని నివసించే ముగ్గురూ, విషాద ఘటన జరిగిన రోజు రాత్రి గురించి తమ అనుభవాన్ని వివరించారు. 'నేను ఒక అడుగు ముందుకు వేసినప్పుడల్లా, నేను మానవ మాంసం, శరీర భాగాలపై అడుగు పెట్టాను. చుట్టూ మృతదేహాలు ఉన్నాయి' అని రైల్వే ట్రాక్‌లను నిర్మించడానికి నియమించిన ప్రైవేట్ సంస్థతో కలిసి పని చేస్తున్న అలోక్ తెలిపారు. 'మేము కంపార్ట్‌మెంట్ లోపలికి వెళ్లాము. మృతదేహాలను చూశాము. కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రయాణీకులను రక్షించడానికి ప్రయత్నించాము. మేము ఎనిమిది మంది ఉన్నాము. 100 నుండి 150 మృతదేహాలను బయటకు తీశాము' అని ఆయన వివరించాడు. 'శరీరాలు రక్తంతో తడిసిపోయాయి. వారిలో చాలా మంది చేతులు, కాళ్లు తెగిపోయాయి. గాయపడిన వారిని మేము సమీపంలోని బస్‌స్టాండ్‌కు పంపాము. అందువల్ల వారిని వైద్య సహాయం కోసం సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లొచ్చని' అలోక్ శుక్లా ఒట్టి చేతులతో మృతదేహాలను బయటకు తీసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. అలోక్ స్నేహితుడు ఘ్యాన్‌షామ్ బెహ్రా మాట్లాడుతూ ప్రజలు ఎలా అరుస్తున్నారో, నొప్పితో అరుస్తూ సహాయం కోసం ఎంతగానో పిలిచారని గుర్తు చేసుకున్నారు. 'రైల్వే ట్రాక్‌లపై చేతులు, తలలు, శరీర భాగాలు పడి ఉండడాన్ని చూశాము. మేము సుమారు ఒకటిన్నర గంటల పాటు మృతదేహాలను వెలికితీశాము. ప్రజలు అరుపులు విన్నాము. మేము కొంతమందిని ఆస్పత్రికి కూడా పంపాము' అని ఘ్యాన్‌షామ్ బెహ్రా చెప్పారు. తుక్నా దాస్ (38) అనే భవన నిర్మాణ కార్మికుడు ప్రమాద స్థలం పక్కనే ఉన్న ఆలయంలో పని చేస్తున్నాడు. అతని కళ్ల ముందే ఘోర ప్రమాదం జరిగినప్పుడు అతను ఆలయం పైకప్పు పైన ఉన్నాడు. దుర్ఘటన చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. 'కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొట్టింది.. సరుకు రవాణా రైలు ఉన్న అదే ట్రాక్‌పై అది నడుస్తోంది. ప్రజలు హమ్మో బచావో అని ఏడుస్తున్నారు. ఒకరికి చేయి, కొందరికి కాలు, మరికొందరికి ముఖాలు ఛిద్రమయ్యాయి' అని దాస్ అన్నారు. 'ప్రజలు నీరు అడుగుతున్నారు. నేను సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ పడి ఉన్న మృతదేహాలను చూశాను. నేను ఒకేసారి 60 మృతదేహాలను చూశాను. రైలు పట్టాలపై పడి ఉన్న చిన్నారులు, వృద్ధుల మృతదేహాలను చూశాను. ఒక గంట తర్వాత పోలీసులు వచ్చారు' అని తెలిపాడు. 'ప్రమాద సమయంలో పూర్తిగా చీకటిగా ఉంది. ప్రజలను రక్షించడానికి నేను మొబైల్ టార్చ్‌ని ఉపయోగించాను' అని తుక్నా దాస్ గుర్తుచేసుకున్నాడు. భారతదేశంలోని అత్యంత ఘోరమైన రైల్వే ప్రమాదాలలో ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన మూడు రైళ్ల దుర్ఘటన ఒకటి. బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ప్రమాదానికి గురయ్యాయి. మెయిన్‌లైన్‌లోకి వెళ్లేందుకు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు సిగ్నల్ ఇచ్చినప్పటికీ అది టేకాఫ్ కావడంతో రైలు లూప్ లైన్‌లోకి ప్రవేశించి అక్కడ ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది.

అతి వేగంతో వస్తున్న బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పక్కనే ఉన్న ట్రాక్‌పై చెల్లాచెదురుగా ఉన్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లపైకి దూసుకెళ్లింది. కోల్‌కతాకు దక్షిణంగా 250 కిలోమీటర్లు, భువనేశ్వర్‌కు ఉత్తరాన 170 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలాసోర్‌లోని బహనాగా బజార్ స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. శనివారం మధ్యాహ్నం సహాయక చర్యలను ముగించి ట్రాక్‌ల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.

## ప్రమాద తీవ్రతకు అదీ ఓ కారణమే: రైల్వే బోర్డు

**న్యూఢిల్లీ:** సిగ్నలింగ్‌లో సమస్య కారణంగా ఒడిశా రైలు ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా తేలిందని రైల్వే బోర్డు తెలిపింది. అయితే, ఈ ఘటనపై రైల్వే సేఫ్టీ కమిషనర్ నుంచి పూర్తిస్థాయి నివేదిక రావాల్సి ఉందని వెల్లడించింది. ఈ ఘటనలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ప్రమాదానికి గురయినట్లు తెలిపింది. ఆ సమయంలో రైలు దాదాపు గంటకు 128 కి.మీ వేగంతో ఉన్నట్లు పేర్కొంది. అయితే, అతివేగం ప్రమాదానికి కారణం కాదని వెల్లడించింది. 'ఒడిశా రైలు ప్రమాద ఘటనలో గూడ్స్ రైలు పట్టాలు తప్పలేదు. ఆ గూడ్స్ రైలులో ఇనుప ఖనిజం ఉన్నందున... దాన్ని ఢీకొన్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌పై తీవ్ర ప్రభావం పడింది. ఇది భారీ సంఖ్యలో మరణాలు, గాయాలకు దారితీసింది. ఈ క్రమంలోనే పట్టాలు తప్పిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలు డౌన్‌లైన్‌లోకి వచ్చి... దానిపై 126 కి.మీ వేగంతో వెళ్తోన్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ చివరి రెండు బోగీలను ఢీకొట్టాయి' అని రైల్వే బోర్డు (ఆపరేషన్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్) సభ్యురాలు జయవర్మ సిన్హా వెల్లడించారు. బాధిత కుటుంబీకులు హెల్ప్‌లైన్ నంబర్ 139ను సంప్రదించవచ్చని సూచించారు. వారి ప్రయాణం, ఇతర ఖర్చులు భరిస్తామని తెలిపారు.

## కుమారుడు కనిపించక.. ఓ తండ్రి వెతుకులాట

**కటక్:** ఒడిశా ఘటనకు సంబంధించి.. ఆయా రైళ్లలో ప్రయాణించిన తమ వారి జాడ తెలియక కుటుంబ సభ్యులు అల్లాడిపోతున్నారు. ఏ అధికారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దుర్ఘటన గురించి విన్న భద్రక్ జిల్లా సుగో గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు హుటాహుటిన బాలేశ్వర్ చేరుకున్నారు. రైలులో ప్రయాణిస్తున్న తన కుమారుడి గురించి రోదిస్తూ కనిపించినవారినల్లా అడిగారు. మృతదేహాలు ఉంచిన ప్రదేశానికి వెళ్లి ఒక్కో మృతదేహం ముసుగు తొలగిస్తూ కుమారుడు కనపడతాడని చూశారు. అయినా ఫలితం లేకపోవడంతో తన కుమారుడి ఆచూకీ కోసం వేకువజాము నుంచి గాలిస్తున్నానని, ఎక్కడున్నాడో తెలియడం లేదని ఆయన కన్నీరుమున్నీరయ్యారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

### ప్రధానికి వివరించిన ఒడిశా సీఎం పట్నాయక్

**భువనేశ్వర్:** ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో గాయాల పాలైన వారికి మెరుగైన వైద్యచికిత్స అందిస్తున్నట్లు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు. పట్నాయక్ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడి రైలు ప్రమాదానంతర పరిస్థితి, సహాయక చర్యలు, ముఖ్యంగా గాయపడిన ప్రయాణికుల చికిత్స గురించి వివరించారు. గాయపడిన ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు ఒడిశాలోని వివిధ ఆసుపత్రుల్లో అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇతర ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు తమ వంతు కృషి చేస్తున్నారని ప్రధానికి తెలిపారు. 'ప్రతి ప్రాణం విలువైనది'గా భావించి వైద్య సేవలందిస్తున్నామని, గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసుకువెళ్లడం నుంచి చికిత్స కోసం ఏర్పాట్లు చేయడం వరకు క్షతగాత్రుల ప్రాణాలను కాపాడటానికి ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టడం లేదని పట్నాయక్ తెలిపారు. ప్రధాని మోదీకి తాజా పరిస్థితిని వివరిస్తూ... వివిధ ఆసుపత్రుల్లో 1,175 మంది రోగులు చేరారని, వారిలో చికిత్స అనంతరం 793 మంది డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. గాయపడిన చాలా మంది రోగుల పరిస్థితి నిలకడగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం 382 మంది ప్రయాణికులు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ముఖ్యమంత్రి వివరించారు. కాగా సంక్షోభ సమయంలో సత్వర, సమర్థ చర్యలు తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి, ఒడిశా ప్రభుత్వానికి ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైతే ఎలాంటి సాయమైనా అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధానిని ఉటంకిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

## ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అంటే ఏమిటి?

**న్యూఢిల్లీ:** ఒడిశాలోని బాలేశ్వర్‌లో జరిగిన రైలు దుర్ఘటనకు ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలో మార్పే కారణమని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ప్రమాదానికి ఇది ఏ రకంగా కారణమో ఆయన వెల్లడించలేదు. తుది నివేదిక వచ్చాక కారణం తెలుస్తుందని తెలిపారు. రైల్వేలో ప్రమాదాల నివారణకు ఈ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుంది. ఒకే పట్టాలపై ఏకకాలంలో రెండు రైళ్లు ఉండకుండా చూస్తూ పట్టాలను కేటాయించే సమగ్రమైన సిగ్నల్ వ్యవస్థ ఇది. రైలు ప్రయాణాలు సురక్షితంగా జరిగేలా చేయడం... సిగ్నల్స్‌లో ఎటువంటి అవాంఛిత మార్పులు రాకుండా చూడటం దీని ప్రాథమిక విధి. రైలు ప్రయాణించే మార్గం పూర్తిగా సురక్షితమని తనిఖీల్లో తేలేవరకు రైలుకు సిగ్నల్స్ ఇవ్వకుండా ఇది ఆపుతుంది. ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ వినియోగంలోకి వచ్చిన తర్వాత రైళ్లు ఢీకొనడాలు, ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. దీంతోపాటు రైల్వే ఆపరేషన్లలో భద్రత మరింత బలోపేతమైంది. రైళ్ల కదలికల పర్యవేక్షణ, నియంత్రణకు ఈ వ్యవస్థ ఎలక్ట్రానిక్ కంట్రోల్ వ్యవస్థ, కంప్యూటర్లను వినియోగించుకొంటుంది. గతంలో మాన్యువల్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో భర్తీ చేశారు. గతంలో సిగ్నల్స్‌ను నియంత్రించడానికి రాడ్లు, స్విచ్‌లను వినియోగించేవారు.

## కేంద్రమంత్రి ప్రయాణిస్తున్న విమానం అత్యవసర ల్యాండింగ్

**గువహతి:** సాంకేతిక సమస్యల కారణంగా కేంద్రమంత్రి ప్రయాణిస్తున్న విమానంఅత్యవసరంగా కిందకు దిగింది. ఈ ఘటన అసోంలోని గువహతిలో చోటుచేసుకొంది. ఆదివారం ఉదయం కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి రామేశ్వర్, మరో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఈ విమానాన్ని గువహతి విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్టు తెలిసింది. దీనిపై మీడియాతో టెలిఫోన్‌లో రామేశ్వర్ తెలి మాట్లాడుతూ తాను ఇంకా విమానాశ్రయంలోనే ఉన్నట్లు తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత్, తెరస్ గొవల్లాతో కలిసి తాను విమానంలో బయల్దేరానని, తాను దులియాజన్, టింగ్‌ఖాంగ్, టిన్సుకియా సమావేశాల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. తమ విమానం గాల్లోకి ఎగిరిన 15-20 నిమిషాల తర్వాత దిబ్రూగఢ్‌లో దిగాల్సి ఉందని, కానీ, సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి గువహతిలో అత్యవసరంగా దింపారన్నారు. తాము సురక్షితంగా ఉన్నామన్నారు. దిబ్రూగఢ్ వెళ్లాల్సిన ఇండిగో విమానం అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయాన్ని గువహతి విమానాశ్రయ వర్గాలు ధ్రువీకరించాయి.

## రైలు ప్రమాదంపై సుప్రీంలో పిల్

**న్యూఢిల్లీ:** ఒడిశాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైన ఘటనపై సుప్రీంకోర్టులో ప్రజాహిత వాజ్యం దాఖలైంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 290 మందికిపైగా మరణించగా... 1,100 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో రైల్వేలో రిస్క్ అండ్ సేఫ్టీ కొలమానాలను విశ్లేషించి సూచనలు జారీ చేసేలా ఓ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో నిపుణులను సభ్యులుగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ నివేదికను సుప్రీంకు అందజేసేలా చూడాలన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయవాది విశాల్ ఇవారీ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పశ్చిమబెంగాల్‌కు చెందిన బాధితులను కోల్‌కతా చేర్చేందుకు భువనేశ్వర్, కటక్, పూరి ప్రాంతాల నుంచి ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఇక్కడి నుంచి కోల్‌కతాకు రైలు సేవలు నిలిచిపోయాయి. ఈ ప్రయాణ ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి భరిస్తుందని ఒడిశా సీఎంవో ఓ ప్రకటనలో పేర్కొంది.

# ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు ముమ్మరం

**బాలాసోర్ :** ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో శుక్రవారం మూడు రైళ్లు ఢీకొన్న దుర్ఘటన తర్వాత అక్కడ దెబ్బతిన్న రైలు మార్గాలను పునరుద్ధరించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లకు మరమ్మతులను కూడా వేగంగా చేస్తున్నారు. రైలు ప్రమాదం కారణంగా చెన్నై-కోల్‌కతా మార్గంలో ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రాల మధ్య ప్రయాణీకులు, వస్తువుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బహనాగ బజార్ స్టేషన్ వద్ద ఈ ప్రమాదం జరిగిన తర్వాత తూర్పు, దక్షిణ భారతదేశాన్ని కలిపే ప్రధాన ట్రంక్ లైన్‌లో రైల్వే సేవలను పునరుద్ధరించేందుకు బుల్డోజర్‌లు, క్రేన్‌ల బృందం రాత్రిపూట ధ్వంసమైన రైల్వే కోచ్‌లను పక్కకు తొలగించడంతో పాటు చాలా రైల్వే ట్రాక్‌లను పునరుద్ధరించే చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. తెగిపోయిన ట్రాక్‌లు, ఓవర్‌హెడ్ విద్యుత్ కేబుళ్ల మరమ్మతులు కూడా కొనసాగుతున్నాయని వారు వివరించారు. ఇక్కడ విడిది చేసిన కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం తెల్లవారుజామున రైల్వే ప్రమాద స్థలాన్ని సందర్శించారు. పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైష్ణవ్ తెలిపారు. 'సహాయక కార్యక్రమాలు ముగిశాయి. బాధిత ప్రజలను ఇంటికి తిరిగి పంపించడానికి మేము స్థానిక పాలనా యంత్రాంగంతో కలిసి పని చేస్తున్నాము' అని ప్రధాన్ తెలిపారు. దేశంలోని రెండు ముఖ్యమైన ప్రాంతాల మధ్య రైల్వే వ్యవస్థ పని చేయడం ప్రారంభించేలా ట్రాక్‌లను పునరుద్ధరించడం పెద్ద సవాలు అని కూడా ఆయన అన్నారు. 'మంగళవారం నాటికి మనం దీన్ని చేయగలగాలి' అని మంత్రి తెలిపారు. 'మాకు 24 గంటలూ పని చేసే బృందాలు ఉన్నాయి. కనీసం రెండు లైన్లను పైకి క్రిందికి పునరుద్ధరించడం వీలైనంత త్వరగా చాలా అవసరం' అని అక్కడ ఉన్న రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'ట్రాక్‌లపై పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. మేము ఓవర్‌హెడ్ కేబుళ్లు, మాస్ట్‌లపై కూడా పని చేస్తున్నాము. త్వరలో డౌన్‌లైన్ పునరుద్ధరించబడుతుంది. ఆపై అప్ లైన్ చేస్తాము' అని అధికారి వివరించారు.

## రైలు ప్రమాదాలతో లక్షలమంది బలి

### ఎన్‌సీఆర్‌బీ నివేదిక




**న్యూఢిల్లీ:** ఒడిశాలో అత్యంత భయానక రైలు ప్రమాదం సంభవించడంతో రైలు ప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టం, రైల్వే శాఖ అమలు చేస్తున్న భద్రతా చర్యలపై చర్చ మళ్లీ ప్రారంభమైంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో ప్రకారం గడచిన పదేళ్లలో జరిగిన రైలు ప్రమాదాల్లో 2.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. రైళ్ల కింద పడిపోవడం, పట్టాలపై ఉన్నవారిపై నుంచి రైళ్లు దూసుకెళ్లడం వంటి దుర్ఘటనల్లో మరణించినవారి సంఖ్య కలుపుకుంటే గడచిన పదేళ్లలో 2.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 70 శాతం మంది 2017-21 మధ్య కాలంలో మరణించారు. ఎన్‌సీఆర్‌బీ రైలు ప్రమాదాలను ఐదు కేటగిరీలుగా వర్గీకరించింది. పట్టాలు తప్పడం, ఢీకొట్టడం, పేలుళ్లు/అగ్ని ప్రమాదాలు, రైళ్లపై నుంచి పడిపోవడం లేదా పట్టాలపై ఉన్నవారిని రైలు ఢీకొట్టడం, ఇతర కారణాలు అనే ఐదు రకాలుగా విభజించింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం 2011లో ప్రమాదవశాత్తూ లేదా ఆత్మహత్య కారణంగా 25,872 మంది మరణించారు. 2012లో ఈ సంఖ్య 27 వేలకు పెరిగింది. 2013లో 27,765 మంది, 2014లో 25 వేల మంది, 2017లో 24 వేల మంది, 2019లో 24,619 మంది ప్రాణాలు కోల్పోయారు. 2020లో కరోనా మహమ్మారి సమయంలో రైలు ప్రమాదాల వల్ల మరణించినవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. 11,968 మంది రైలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. అయితే 2021లో 27 శాతం పెరిగి, 16,431 మంది ఈ కారణంతో మరణించారు. రైళ్ల నుంచి పడిపోవడం, వ్యక్తులపై నుంచి రైళ్లు దూసుకెళ్లడం కేటగిరీలో ఎక్కువ మంది ఉన్నారు. 2021లో ఈ కారణాలతో మరణించిన వారి సంఖ్య 11,036 మంది. ఇతర కారణాలతో మరణించినవారి సంఖ్య 5,287 మంది. ఆ కారణాలేంటో వివరంగా చెప్పలేదు. రైళ్లు ఢీకొనడం వల్ల 86 మంది, పట్టాలు తప్పడం వల్ల 22 మంది మరణించారు. 2021లో అగ్ని ప్రమాదాలు లేదా పేలుళ్లలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదు. 2017-21 మధ్య కాలంలో లక్ష మంది రైలు ప్రమాదాల వల్ల మరణించారు. వీరిలో 71 వేల మంది రైళ్ల నుంచి పడిపోవడం లేదా వ్యక్తులపై నుంచి రైలు దూసుకెళ్లడం వల్ల ప్రాణాలు కోల్పోయారు. రైళ్లు పట్టాలు తప్పడం వల్ల 293 మంది, ఢీకొట్టడం వల్ల 446 మంది మరణించారు. 2017-21 మధ్య కాలంలో మహారాష్ట్రలో అత్యధిక సంఖ్యలో 17 వేల మంది రైలు ప్రమాదాల వల్ల మరణించారు. ఉత్తరప్రదేశ్‌లో 13,074 మంది, పశ్చిమ బెంగాల్‌లో 11,967 మంది, ఒడిశాలో 1,845 మంది ప్రాణాలు కోల్పోయారు.

# రైల్వే మంత్రి రాజీనామాకు ఈ కారణం సరిపోదా?

### కాగ్ సూచనలు అమలు చేయకపోవడంపై ఎన్‌సీపీ

**ముంబై :** రైలు ప్రమాదాల నివారణకు 2022 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో సూచించిన చర్యలను కేంద్రం ఎందుకు అమలు చేయలేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఆదివారం ప్రశ్నించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయడానికి ఈ కారణం సరిపోదా అని నిలదీసింది. ఒడిశా రైలు దుర్ఘటన నేపథ్యంలో కాగ్ నివేదిక ప్రకారం, అనేక లోపాల కారణంగా రైలు ప్రమాదాలు జరుగుతాయని, అయితే రైల్వే మంత్రిత్వ శాఖ, మంత్రి ఈ హెచ్చరికను సీరియస్‌గా తీసుకోవడంలో విఫలమయ్యారని పార్టీ ఆరోపించింది. 2,500 మంది ప్రయాణికులతో వెళ్తున్న బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలుతో కూడిన ఒడిశా రైలు ప్రమాదం బాలాసోర్‌లోని బహనాగా బజార్ స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు సంభవించింది. ఒడిశా రైలు ప్రమాద ఘటన తర్వాత రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశారు. ఇది 'కవచ్' వ్యవస్థపై చర్చకు దారితీసింది. 'భారతీయ రైల్వేలలో పట్టాలు తప్పడం'పై 2022 నివేదిక అనేక లోపాలను ఎత్తిచూపింది. పట్టాలు తప్పడానికి కారణమైన 24 అంశాలను వెల్లడించింది. రైలు ప్రమాదాలు జరగడానికి వేచి ఉన్నాయన్న వాస్తవాన్ని ఎత్తిచూపుతూ ఆ నివేదికలో చాలా తీవ్రమైన అంశాలు ఉన్నాయని ఎన్‌సీపీ అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాలు తప్పడం, ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు రైల్వే మంత్రిత్వ శాఖ ద్వారా స్పష్టంగా నిర్దేశించబడి అమలయిందా లేదా అనేది కాగ్ ఆడిట్ ప్రధాన దృష్టి అని ఆయన చెప్పారు. ఒడిశా రైలు ప్రమాదం తర్వాత, ఆడిట్ నివేదికను పాటించలేదని స్పష్టంగా కనిపిస్తోందని క్రాస్టో ఆరోపించారు. కాగ్ నివేదికను మంత్రి వైష్ణవ్ చదివారా అని ఎన్‌సీపీ అధికార ప్రతినిధి ప్రశ్నించారు. 'అతను అలా చేస్తే, దానిని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదు. కాగ్ సూచనలను ఎందుకు వెంటనే అమలులోకి తీసుకురాలేదు?' అని ఆయన ప్రశ్నించారు. కాగ్ ఆడిట్ నివేదిక రైల్వే మంత్రిత్వ శాఖను విపత్తుల గురించి అప్రమత్తం చేసింది. మంత్రిత్వ శాఖ, మంత్రి ఈ న్యాయమైన హెచ్చరికను సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది. అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయడానికి ఇది సరిపోదా అని క్రాస్టో ప్రశ్నించారు.

## కొత్త రైళ్ల ప్రారంభంపైనే ప్రధాని శ్రద్ధ

### ప్రమాదాల నివారణకు చర్యలేవి

### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే



**న్యూఢిల్లీ:** ఒడిశా రైలు దుర్ఘటన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రైల్వే భద్రతపై శ్రద్ధ చూపకుండా కొత్త రైళ్లను ప్రారంభించడంలో తీరికలేకుండా ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పై నుంచి కింది వరకు అన్ని పోస్టులకు జవాబుదారీతనం ఉండాలని ఖర్గే పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన వరుస ట్వీట్లు చేశారు. రైల్వేలో మూడు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా నియామకాలు చేయాల్సిన ఉన్నత స్థాయి పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా ఈ పోస్టులను ఎందుకు భర్తీ చేయలేదు? ఉద్యోగుల కొరత కారణంగా లోకో పైలట్ల ఎక్కువ పని గంటలు పనిచేయడమే ప్రమాదాల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణమని ఇటీవల రైల్వే బోర్డు స్వయంగా అంగీకరించిందని, ఆ పోస్టులను కూడా ఎందుకు భర్తీ చేయలేదని ఖర్గే ప్రశ్నించారు. మైసూరులో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనను ఉదహరిస్తూ... నైరుతి రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ ఫిబ్రవరి 8, 2023న సిగ్నలింగ్ వ్యవస్థను బాగు చేయాలని కోరినప్పటికీ రైల్వే మంత్రిత్వ శాఖ దీనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ఖర్గే నిలదీశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 323వ నివేదికలో రైల్వే సేఫ్టీ కమిషన్ (సీఆర్‌ఎస్) సిఫార్సులపై రైల్వే బోర్డు నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపిందని ఆయన గుర్తు చేశారు. 8 నుంచి 10 శాతం ప్రమాదాల్లో మాత్రమే సీఆర్‌ఎస్ దర్యాప్తు చేస్తుందన్నారు. అలాంటప్పుడు సీఆర్‌ఎస్‌ను ఎందుకు బలోపేతం చేయలేదని ప్రశ్నించారు. కాగ్ తాజా నివేదిక ప్రకారం 2017-18, 2020-21 మధ్య జరిగిన 10 రైలు ప్రమాదాలలో దాదాపు ఏడు... రైళ్లు పట్టాలు తప్పడం వల్ల జరిగినవే అయినా ట్రాక్ నిర్వహణ మెరుగుదలపై ఎందుకు దృష్టి పెట్టలేదని, రాష్ట్రీయ రైల్ సంరక్షా కోష్ (ఆర్‌ఆర్‌ఎస్‌కే)కు నిధులు ఎందుకు కోత వేశారని, ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో ఎందుకు భారీ క్షీణత నెలకొందని ఖర్గే నిలదీశారు. రైళ్లు ఢీకొనకుండా ఉండే వ్యవస్థను 2011లో భారత్‌కు చెందిన రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్ఓ) అభివృద్ధి చేయగా, మోదీ ప్రభుత్వం దానిని 'కవచ్' గా పేరు మార్చిందని, 2022 మార్చిలో రైల్వే మంత్రి స్వయంగా దానిని ప్రదర్శించారని ఖర్గే పేర్కొన్నారు. మరి ఈ వ్యవస్థను కేవలం 4శాతం రూట్లలోనే ఎందుకు ప్రవేశపెట్టారని ప్రశ్నించారు.

**రైల్వే మంత్రి రాజీనామా చేయాలి: ప్రియాంక**

ఒడిశా రైలు ప్రమాద ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. నిపుణుల హెచ్చరికలు, సూచనలు, పార్లమెంటరీ కమిటీ, కాగ్ నివేదికను పట్టించుకోకపోవడానికి, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులు, కీలక రంగాలలో నిధుల కొరతకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆమె ప్రశ్నించారు. 'లాల్ బహదూర్ శాస్త్రి జీ, నితీశ్‌కుమార్ జీ, మాధవ్‌రావ్ సింధియాజీల నైతిక మార్గాన్ని అనుసరిస్తూ, రైల్వే మంత్రి రాజీనామా చేయకూడదా?' అని ఆమె పేర్కొన్నారు.

# జాతీయ అభ్యుదయ రచయిత కేతు విశ్వనాథరెడ్డి

**అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు డా.పి.సంజీవమ్మ**

**విశాలాంధ్ర-కడపకలెక్టరేట్:** మానవతావాది, గొప్ప కథారచయిత, విమర్శకుడు కేతు విశ్వనాథరెడ్డిని రాయలసీమకో, రాష్ట్రానికో పరిమితం చెయ్యకూడదని, ఆయన రచనలు అనేక భాషల్లోకి అనువదించబడినందున భారత జాతీయ అభ్యుదయ కథారచయితగా ఆయనను చూడాలని అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు డా.పి.సంజీవమ్మ అన్నారు. ప్రసిద్ధ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభను అరసం కడప జిల్లా శాఖ, వైవీయూ సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్తంగా ఆదివారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. తొలుత కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి వక్తలు, సాహితీవేత్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అరసం కడప జిల్లా శాఖ అధ్యక్షుడు ఆచార్య ఈశ్వరరెడ్డి సభకు అధ్యక్షత వహించారు.డా.సంజీవమ్మ మాట్లాడుతూ కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని సేకరించి, విషయపరంగా విభజించి, ఆరు భాగాలుగా కేతు తన సంపాదకత్వంలో తీసుకువచ్చారన్నారు. విద్యారంగానికి పాఠ్యపుస్తక సంపాదకులుగా విశేష సేవలందించడమే కాక అభ్యుదయ వాదాన్ని పాఠ్యాంశాల్లోకి తీసుకువచ్చి ఉన్నతీకరించారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ అభ్యుదయ భావాలతో పీడితుల పక్షాన తన కలాన్ని ఝుళిపించిన మానవతావాది ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని కొనియాడారు. కేతు విశ్వనాథరెడ్డి అభ్యుదయ సాహిత్యాన్ని, మార్క్సిస్టు తాత్వికతను ఒంటపట్టించుకున్నారని తెలిపారు. ఆయన మననుంచి దూరం కావడం దిగ్భ్రాంతికరమన్నారు. కమ్యూనిస్టు పార్టీతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉండేదని, విశాలాంధ్రకు ఆయన అందించిన సేవ శ్లాఘనీయమన్నారు. ఆయన కథలు, నవలలు, ఇతర రచనలను విశాలాంధ్ర ద్వారా పుస్తకాలుగా తీసుకువస్తామన్నారు. ఆయన రచించిన 'సమ్మెకున్న నేల' జనహృదయానికి దగ్గరగా ఉందని, యథార్థ సంఘటనలు అందులో కనిపిస్తాయన్నారు. యువ రచయితలను వెన్నుతట్టి ప్రోత్సహించేవారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు. అరసం కడప జిల్లా శాఖ అధ్యక్షుడు ఆచార్య ఈశ్వర రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి... మనుషులను ప్రేమించేవారని, ప్రాంతాల మధ్య వైరుధ్యాన్ని, దళితుల దైన్యస్థితిని, లింగ వివక్షతను తన కథల ద్వారా ఎండగట్టారన్నారు. ఆచార్య కేతు కథలను రేపటి తరానికి అందించి చదివించగలిగితే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, అదే మనం ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ... ఆచార్య కేతుకు విశ్వవిద్యాలయంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తెలుగు శాఖకు మార్గదర్శనం చెయ్యడమే కాక గజ్జెల మల్లారెడ్డి అవార్డు ఎంపికలో కీలకపాత్ర పోషించారన్నారు. సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, అరసం ఏటా విశ్వనాథరెడ్డి పేరిట సదస్సులునిర్వహించి అవార్డులు ఇచ్చేలా చూడాలని కోరారు. కెస్మో సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా ఏటా కేతు విశ్వనాథ రెడ్డి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తామని ప్రకటించారు. ప్రముఖ కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటి చీఫ్ ప్యాట్రన్ లయన్ పోతుల వెంకట్రామి రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ప్రముఖ కథారచయిత తవ్వా ఓబుల్ రెడ్డి, డా. భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డా. తవ్వా వెంకటయ్య, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు యం.బాలాజీ రావు, కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ అధ్యక్షులు లయన్ కొండూరు జనార్దన రాజు తదితరులు ప్రసంగిస్తూ కేతు విశ్వనాథ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయన సాహితీ సేవలను కొనియాడారు. అరసం కడపజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డా. తుమ్మలూరు సురేష్‌బాబు సభకు స్వాగతం పలికారు. ఒడిశా రైలు దుర్ఘటన మృతులకు సభ సంతాపం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగా సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డా.ఎస్.రాజగోపాల రెడ్డి, డా.తక్కోలు మాచిరెడ్డి, హజరత్తయ్య, కుమారస్వామి రెడ్డి, డా.వెల్లాల వేంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

## బీహార్‌లో కుప్పకూలిన వంతెన

**పాట్నా:** బీహార్‌లోని భాగల్పూర్‌లో నిర్మాణంలో ఉన్న అగువానీ-సుల్తాన్‌గంజ్ తీగల వంతెన కూలిపోయింది. వంతెన కూలిన దృశ్యాన్ని స్థానికులు వీడియో తీశారు. అయితే వంతెన కూలడం ఇది రెండోసారని చెబుతున్నారు. కెమెరాలో చిక్కుకున్న దృశ్యాల ప్రకారం... నిర్మాణంలో వంతెన రెండు భాగాలు ఒకదాని తర్వాత ఒకటి కూలిపోతున్నట్లు కనిపిస్తున్నాయి. ఖగారియాలో రూ.1,700 కోట్ల వ్యయంతో అగువానీ-సుల్తాన్‌గంజ్ వంతెనను నిర్మిస్తున్నారు. గంగా నదిపై ఈ వంతెన నిర్మాణం జరుగుతుంది. ఆదివారం కావడంతో చాలా తక్కువ మంది కార్మికులు ఉండడంతో ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణ పనులు జరగడం లేదని చెబుతున్నారు. నివేదికల ప్రకారం, వంతెన కనీసం 3 అడుగుల భాగం దిగువన ఉన్న గంగా నదిలో కూలిపోయింది. గత ఏడాది ఏప్రిల్‌లో తుఫాను కారణంగా వంతెన కొంత దెబ్బతింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విచారణకు ఆదేశించారు. 2015లో నితీశ్ ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2020 నాటికి పూర్తికావలసి ఉండగా ఇప్పటికీ పూర్తికాలేదు.

## యమున ప్రక్షాళన కోసం మానవహారం

**న్యూఢిల్లీ:** కాలుష్యం బారి నుండి యమునా నదిని రక్షించాలని కోరుతూ పెద్ద సంఖ్యలో ప్రజలు మానవహారం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున అనేక ప్రాంతాల్లో యమునా నది తీరానికి భారీగా ప్రజలు తరలివచ్చి మానవహారంగా ఏర్పడ్డారు. యమునా సన్సద్ కార్యక్రమం కింద ఐటీఓ, వజీరాబాద్, కలిండికుంజ్, గీతా కాలనీ, ఓల్డ్ ఉస్మాన్‌పూర్‌తో సహా అనేక ప్రదేశాలలో మానవ హారం నిర్వహించారు. మురుగు, పారిశ్రామిక వ్యర్థాలతో నిండిన నదిని ప్రక్షాళన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక, సాంస్కృతిక, మత సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారుడిగా బాగ్దాదీ

**విశాలాంధ్ర-విజయవాడ:** కడప ప్రాంతానికి చెందిన ముస్లిం మతగురువు ముఫ్తి సయ్యద్ షా మొహమ్మద్ అలీ బాగ్దాదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్య మంత్రి బి.అంజాద్ బాషా, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీలు ఇసాక్ బాషా, రుహుల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బిస్ గౌసల్ ఆజమ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అసిఫ్ అలీ, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ షమీమ్ అస్లం, వైసీపీ మైనారిటీ విభాగం చైర్మన్ వి.ఖాదర్ బాషా పాల్గొన్నారు.

# రైల్వే భద్రతలో లోపాలెన్నో...

- పట్టాల పునరుద్ధరణ, నిర్వహణపై నిర్లక్ష్యం
- మురిగిపోతున్న నిధులు - ప్రమాదాలపై దర్యాప్తుల్లో జాప్యం
- గతేడాది ఆడిట్ నివేదికలో ఎత్తిచూపిన కాగ్

**న్యూఢిల్లీ:** దేశంలో రైల్వే భద్రతకు సంబంధించి అనేక లోటుపాట్లు ఉన్నాయని, రైలు పట్టాల పునరుద్ధరణకు నిధులు మురిగిపోతున్నాయని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) వెల్లడించింది. ఈ మేరకు వివరాలను 2022 నివేదికలో పొందుపర్చింది. ఒడిశా, బాలాసోర్‌లో జరిగిన తాజా ప్రమాదంతో ఈ నివేదిక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రైలు ప్రమాదాలపై 2022లో కాగ్ ఇచ్చిన నివేదికలో రైళ్ల పట్టాలు తప్పడం, ఢీకొనడం వంటివి నివారించేందుకు భారతీయ రైల్వే ఎలాంటి చర్యలు తీసుకుంటుందని, అవి సక్రమంగా అమలు అవుతున్నాయా లేదా అన్నది స్పష్టమైంది. ప్రమాదాల తర్వాత తనిఖీలలో లోటుపాట్లు, దర్యాప్తు నివేదికలు సమర్పించక పోవడం, ఒకవేళ సమర్పించినా అవి సమగ్రంగా ఉండక పోవడం, ప్రాధాన్యతగల పనుల కోసం నిర్దేశిత రైల్వేనిధిని వాడకపోవడం, ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధులు తిరస్కరించడం, భద్రతా ఆపరేషన్లకు సరిపడ సిబ్బంది లేకపోవడం వంటి అనేక అంశాలను కాగ్ నివేదించింది. రైల్వే పట్టాలను పర్యవేక్షించే ట్రాక్ రికార్డింగ్ కార్ల పనితీరులో 30 శాతం నుంచి 100శాతం లోపాలు ఉండటాన్ని ప్రస్తావించింది. ట్రాక్‌ల నిర్వహణ వ్యవస్థ (టీఎంఎస్) వైఫల్యాలనూ ఎత్తిచూపింది. 2017 ఏప్రిల్ నుంచి 2021 మార్చి వరకు 422 రైళ్ల పట్టాలు తప్పగా వీటిని ఇంజనీరింగ్ విభాగానికి ఆపాదించారు. రైళ్ల పడిపోవడానికి ప్రధాన కారణాలు 'ట్రాక్‌ల నిర్వహణ' (171 కేసులు), 'పరిమితస్థాయికి మించిన ట్రాక్ పారామీటర్లు' (156 కేసులు)గా కాగ్ నివేదిక పేర్కొంది. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కూడా కారణాలుగా తెలిపింది. ఆపరేటింగ్ విభాగం బాధ్యత వహించాల్సిన ప్రమాదాల సంఖ్య 275 కాగా పాయింట్ల సెట్టింగ్‌లో పొర పాట్లు, షంటింగ్ ఆపరేషన్‌లలో తప్పిదాల వల్ల 84శాతం ప్రమాదాలు జరగడాన్ని కాగ్ గుర్తించింది. 63శాతం కేసుల్లో నిర్దేశిత గడువులోగా దర్యాప్తు నివేదికలు సంబంధిత అధికారులకు సమర్పించలేదు, మరో 49శాతం కేసుల్లో సంబంధిత అధికారుల నివేదికలను స్వీకరించడంలో జాప్యం జరిగిందని కాగ్ పేర్కొంది.

రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ నుంచి ప్రధాన పనులపై మొత్తం వ్యయం తగ్గిందని నివేదిక తెలిపింది. ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు తగ్గిపోయాయని, అందుకోసం కేటాయించిన నిధులు మురిగిపోయాయని పేర్కొంది. ప్రాధాన్యతలేని పనుల కోసం వ్యయం పెరిగినట్లు తెలిపింది. రైల్వే భద్రతకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక నిధిని నెలకొల్పిన ఉద్దేశం నెరవేరలేదని వెల్లడించింది. 2017-21లో 1,127 రైళ్లు పడిపోగా/పట్టాలు తప్పగా ఇందులో 289 ప్రమాదాలు అంటే 26శాతం కేసులు ట్రాక్‌ల పునరుద్ధరణ జరగకపోవడానికి సంబంధించినవిగా కాగ్ తెలిపింది. 2,908 మ్యానువల్ లెవల్ క్రాసింగ్‌లను 2018-21లో తొలగించాలని లక్ష్యంగా పెట్టుకోగా అందులో 2,059 (70శాతం) మాత్రమే తొలగించినట్లు వెల్లడించింది. భద్రతా విభాగంలో సముచిత సిబ్బంది నియామకానికి అవసరమైన చర్యలు తీసుకోక పోవడం వల్ల నిర్వహణపై ప్రభావం పడిందన్న తెలిపింది. ప్రమాదాలు జరిగినప్పుడు వాటి దర్యాప్తులను పూర్తి చేసేందుకు నిర్దేశిత కాలపరిమితి ఉండేలా చర్యలను రైల్వే కచ్చితంగా అమలు చేయాలని కాగ్ సిఫార్సు చేసింది. పటిష్ఠ పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని, ట్రాక్‌ల నిర్వహణ, పర్య వేక్షణపై దృష్టి పెట్టాలని, మెరుగైన టెక్నాలజీలు వినియో గించాలని సూచించింది. ప్రమాదాలు నివారించేం దుకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, పద్ధతులు కాస్త మార్చుకుంటే గతంలో జరిగినట్లు రైలు ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉంటాయని రైల్వేకు కాగ్ హితవు పలికింది.

## డబ్ల్యూటీసీ ఫైనల్‌కు హేజిల్‌వుడ్ దూరం

**లండన్:** ప్రపంచ క్రికెట్ ప్రేమికులందరూ ప్రస్తుతం ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారన్న విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌లోని ఓవల్ మైదానం వేదికగా జూన్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరగబోతుండగా ఆస్ట్రేలియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టులో స్టార్ బౌలర్‌గా కొనసాగుతున్న జోష్ హేజిల్‌వుడ్ ఈ మ్యాచ్‌లో ఆడబోవడంలేదు. గత కొంతకాలంగా హేజిల్‌వుడ్ గాయంతో బాధపడుతుండగా, అతను కోలుకుని డబ్ల్యూటీసీ ఫైనల్ నాటికి అందుబాటులోకి వస్తాడని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు భావించింది. కానీ పూర్తిగా కోలుకోకపోవడంతో ఫైనల్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో మైఖేల్ నేజర్ ను జట్టులోకి తీసుకున్నట్లు ఆస్ట్రేలియా బోర్డు తెలిపింది.

ఐపీఎల్ లో బెంగళూరు తరపున కొన్ని మ్యాచ్‌లు ఆడిన హేజిల్ వుడ్ గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. కాగా ఫైనల్ మ్యాచ్ కోసం ఇప్పటికే ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన రెండు జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. టీమిండియాలో కీలక ఆటగాళ్లుగా కొనసాగుతున్న రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, బుమ్రా, కేఎల్ రాహుల్ లాంటి కూడా గాయం కారణంగా డబ్ల్యూటీసీ ఫైనల్ కు అందుబాటులో లేకుండా పోయారు.

**తుది జట్టులో అశ్విన్ ఆడకపోవచ్చు: వెటోరీ**

డబ్ల్యూటీసి ఫైనల్ మ్యాచ్ జరగబోయే ఓవల్ మైదానం పేస్‌కు అనుకూలిస్తుందన్న విషయం తెలిసిందే. దీంతో కేవలం ఒకే ఒక స్పిన్నర్ తో రెండు జట్లు బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇక భారత జట్టులో ఇలా చోటు దక్కించుకోబోయే స్పిన్నర్ ఎవరు అనేదానిపై చర్చ జరుగుతోంది. కాగా ఇదే విషయంపై ఆస్ట్రేలియా సహాయక కోచ్ డేనియల్ వెటోరి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ ఆస్ట్రేలియా మధ్య జరగబోయే డబ్ల్యూటీసి ఫైనల్ మ్యాచ్లో స్పిన్నర్ అశ్విన్ ఆడకపోవచ్చు అంటూ డేనియల్ వేటోరి అభిప్రాయపడ్డాడు. ఎందుకంటే పేస్‌కి అనుకూలించే ఓవల్ లో భారత్ ముగ్గురు పేసర్లతో పాటు ఒక స్పిన్నర్ తో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇక స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా కు తప్పకుండా తుది జట్టులో అవకాశం దక్కుతుంది. ఇక నాలుగో పేసర్ గా శార్దూల్ ఠాకూర్ కి అవకాశం దక్కవచ్చునని వెటోరీ అభిప్రాయపడ్డాడు.

## ఐపీఎల్‌తో క్రికెట్‌లో ఎన్నో మార్పులు: కమిన్స్

**లండన్:** ఐపీఎల్ క్రికెట్‌లో ఎన్నో మార్పులు తీసుకు వచ్చిందని ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ పేర్కొన్నాడు. ఆటగాళ్ల సమయంపై అంతర్జాతీయ క్రికెట్ గుత్తాధిపత్యానికి ఐపీఎల్ ముగింపు పలికిందని కమిన్స్ తెలిపాడు. ఫ్రాంఛైజీ క్రికెట్ కంటే జాతీయ జట్టు కోసం ప్రాధాన్యత ఇచ్చేలా ఆటగాళ్లను ఒప్పించడం సవాల్‌గా మారనుందని అభిప్రాయపడ్డాడు. లాభదాయక టీ20 లీగ్‌ల కారణంగానే న్యూజిలాండ్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కూడా ట్రెంట్ బౌల్ట్ వద్దన్నాడన్న విషయాన్ని కమిన్స్ అంగీకరించాడు. దశాబ్దం క్రితమే ఐపీఎల్ క్రికెట్ రూపురేఖలను మార్చివేసిందని చెప్పాడు.

'గతంలో ఉన్న మాదిరిగా ఇప్పుడు ఆటగాళ్ల సమయంపై అంతర్జాతీయ క్రికెట్‌కు గుత్తాధిపత్యం లేదు. దశాబ్దం క్రితమే దీనిని ఐపీఎల్ మార్చివేసింది. దీని గురించి మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇక నా జట్టు సహచరులు ఇతర విషయాలకంటే జాతీయ జట్టుకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటాను. అయితే, ఎక్కువ లాభదాయకత ఉండే ఫ్రాంఛైజీ లీగ్‌ల కారణంగా ఇది సవాలుతో కూడుకున్న అంశం' అని కమిన్స్ అన్నాడు. 'ఆస్ట్రేలియా తరఫున ఆడటం ప్రత్యేకం. ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువగా జాతీయ జట్టుకు ఆడాలి. ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలి. దీని గురించి మనం చాలా లోతుగా ఆలోచించాలి. కొన్నేళ్లు గడిస్తే.. 12 నెలల అంతర్జాతీయ క్యాలెండర్ కొద్దిగా భిన్నంగా కనిపించవచ్చు' అని కమిన్స్ వివరించాడు. ఇక క్రికెట్ సాకర్ మార్గంలో వెళ్తోందని, జాతీయ జట్టుకు ఆడేందుకు ఫ్రాంఛైజీల నుంచి అనుమతులు అవసరమయ్యే పరిస్థితులు వస్తాయని తాను నమ్ముతున్నట్లు చెప్పాడు. ఇక డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం తాను ఎదురుచూస్తున్నట్లు కమిన్స్ తెలిపాడు. గత ఎడిషన్‌లో ఫైనల్ వరకూ వెళ్లిన టీమిండియాతో తాము తలపడబోతున్నామన్నాడు.

# మృతుల కుటుంబాలకు ఏపీ సాయం రూ.10 లక్షలు

- తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు
- స్వల్ప గాయాలైన వారికి రూ.లక్ష
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం బాధితులకు పూర్తి సహాయ, సహకారాలు అందించేందుకు అన్ని కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో రైలు ప్రమాద సంఘటనపై పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణితో కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో విజయవాడలో అధికారులతో సమీక్ష నిర్వహించారని, వారి ఆదేశాలను అనుసరించి రైలు ప్రమాద సంఘటనలో మన రాష్ట్రానికి సంబంధించి క్షతగాత్రులను, ప్రమాదానికి గురైన వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు పూర్తి చర్యలు తీసుకున్నామని అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశంతో ఇప్పటికే రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ముగ్గురు ఐఏఎస్ అధికారులు, ముగ్గురు ఐపీఎస్ అధికారుల బృందం ఒడిశాలోని రైలు ప్రమాద స్థలానికి చేరుకుని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రమాద ఘటనలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు, తీవ్రగాయాలైన వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని చెప్పారు. ఈ రైలు ప్రమాదంలో 12841 షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో మన రాష్ట్రానికి చెందిన 484 మంది, 12864 బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది ప్రయాణిస్తున్నారని, మొత్తం 695 మంది ప్రయాణికులను గుర్తించినట్లు తెలిపారు. అయితే ఇందులో 553 మంది క్షేమంగా ఉన్నారని, 21 మందికి స్వల్ప గాయాలు కాగా, ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు మంత్రి బొత్స సత్యనారాయణ వివరించారు. అదేవిధంగా 92 మంది ప్రయాణికులు తాము ప్రయాణం చేయలేదని నిర్ధారించారని, మరో 28 మంది ప్రయాణికుల వివరాలు అందుబాటులోకి రాలేదని అన్నారు. ఇప్పటికే 50 అంబులెన్స్ లను కటక్, భువనేశ్వర్‌లకు పంపించామని తెలిపారు. ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఎటువంటి ఫోన్ కాల్స్ రాలేదని, ఎవరైనా తమ కుటుంబ సభ్యులు ఈ రైలులో ప్రయాణించినట్లయితే వారి వివరాలను హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ఆంధ్ర ప్రదేశ్‌లో దిగవలసిన వారు 484 మంది ఉన్నారని, వీరిలో విశాఖలో 309 మంది, రాజమండ్రిలో 31 మంది, ఏలూరులో 9 మంది, విజయవాడలో 135 మంది దిగవలసి ఉందని అన్నారు. 12864 బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది ప్రయాణిస్తున్నారని, అందులో విశాఖపట్నం నుంచి 33 మంది, రాజమండ్రి నుంచి ముగ్గురు, ఏలూరు నుంచి ఒకరు, విజయవాడ నుంచి 41, బాపట్ల, తెనాలి నుంచి 8 మంది, గుంటూరు నుంచి ఇద్దరు, ఒంగోలు నుంచి 11 మంది, నెల్లూరు నుంచి ముగ్గురు, తిరుపతి నుంచి 107 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ప్రయాణికులలో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలానికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి వృత్తి పరంగా పించను తీసుకొని తిరిగి వస్తూ ప్రమాదంలో మరణించాడని అన్నారు. రాష్ట్రానికి సంబంధించి 20 మంది క్షతగాత్రులను గుర్తించామని, వారిలో ఇద్దరు కేజీహెచ్‌లో, ఇద్దరు సెవెన్ హిల్స్ హాస్పటల్‌లో, ఒకరు ఐఎన్ఎస్ కళ్యాణి హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారని మంత్రి తెలిపారు. మరో 11 మంది వైద్యం చేయించుకొని ఇళ్లకు వెళ్లిపోయారని, మరో నలుగురు ఒడిశా నుంచి ఆంధ్ర ప్రదేశ్‌కు వస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా రైలు ప్రమాద సంఘటన నుంచి బయటపడి విశాఖపట్నం చేరుకున్న ఏడుగురు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా ఖర్చుల నిమిత్తం ఎం.సత్యంకు రూ.30 వేల చెక్కును మంత్రి అందజేశారు.

# మణిపూర్ హింసపై దర్యాప్తునకు త్రిసభ్య కమిషన్

**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో మే ప్రారంభం నుంచి 80 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన జాతి హింసపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. గత వారం జరిగిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన తర్వాత ఈ చర్య జరిగింది. న్యాయమూర్తి జస్టిస్ అజయ్ లాంబా, గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కమిషన్‌కు నేతృత్వం వహిస్తారు. ఇతర సభ్యులుగా రిటైర్డ్ అధికారి హిమాన్షు శేఖర్ దాస్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ స్పెషల్ డైరెక్టర్ అలోక్ ప్రభాకర్ ఉంటారు. హింసకు గల కారణాలు, వ్యాప్తి, దానికి దారితీసిన సంఘటనలను కమిషన్ పరిశీలిస్తుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఎవరైనా విధి నిర్వహణలో లోపాలు లేదా నిర్లక్ష్యం, పరిపాలనా చర్యల సమర్థతపై కూడా దృష్టి సారిస్తుంది. కమిషన్ తన తుది నివేదికను ఆరు నెలల తర్వాత సమర్పిస్తుంది. షెడ్యూల్డ్ తెగ హోదా కోసం మైతేయి సామాజిక వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా మే 3న నిర్వహించిన గిరిజన సంఘీభావ యాత్ర తర్వాత ప్రారంభమైన జాతి ఘర్షణల్లో 80 మందికి పైగా మరణించారు. రిజర్వ్ ఫారెస్ట్ భూమి నుంచి కుకి గ్రామస్తులను ఖాళీ చేయించడంపై మరో ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కుకి గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. గత వారం మణిపూర్‌లో తన నాలుగు రోజుల పర్యటన సందర్భంగా, రాష్ట్రంలో ప్రశాంతతను పునరుద్ధరించే ప్రయ త్నంలో అమిత్ షా వివిధ వర్గాలతో చర్చలు జరిపారు. తన పర్యటన చివరి రోజున, అన్ని సంఘాలు, వర్గాలతో సంభాషణలు నిర్వహించి సామరస్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

**జాతీయ రహదారిపై దిగ్బంధనాలు ఎత్తివేయండి : అమిత్ షా**

ఆహారం, మందులు వంటి నిత్యావసర వస్తువులు హింసకు గురైన రాష్ట్రానికి చేరుకునేలా దిగ్బంధనాలను ఎత్తివేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం మణిపూర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మణిపూర్ ప్రజలకు నా హృదయపూర్వక విజ్ఞప్తి ఏమిటంటే, ఇంఫాల్-దిమాపూర్ జాతీయ రహదారి-2 హైవే వద్ద ఉన్న దిగ్బంధనాలను ఎత్తివేయాలి. తద్వారా ఆహారం, మందులు, పెట్రోల్, డీజిల్, ఇతర అవసరమైన వస్తువులు ప్రజలకు చేరతాయి. ఏకాభిప్రాయం తీసుకు రావడంలో పౌర సమాజ సంస్థలు అవసరమైన కృషి చేయాలని కూడా నేను అభ్యర్థిస్తున్నాను. ఈ స్థితిలో మనం కలిసి మాత్రమే సాధారణ స్థితిని పునరుద్ధరించగలము' అని అమిత్ షా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మణిపూర్‌లో గత 24 గంటల్లో ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగలేదని, రాష్ట్రం 'పూర్తిగా శాంతియుతంగా' ఉందని రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారు కుల్దీప్ సింగ్ చెబుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి ఈ విజ్ఞప్తి చేశారు. 'మణిపూర్‌లో పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా ఉంది. శుక్రవారం సాయంత్రం నుంచి ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగలేదు' అని సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీ సింగ్ వార్తా సంస్థ పీటీఐకి తెలిపారు. మణిపూర్‌లోని లోయలు, కొండల మధ్య ఉన్న బఫర్ జోన్‌లలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్), సైన్యం గస్తీ తిరుగు తున్నాయని, ఆ ప్రాంతాల్లో శాంతి నెలకొందని ఆయన అన్నారు. 'హోం మంత్రి పర్యటన తర్వాత ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నారు. సాధారణ ప్రజలు, పౌర సమాజ సంస్థలు, ప్రముఖ పౌరులు పరిపాలనతో సన్నిహిత సమన్వయంతో పని చేస్తున్నారు. శాంతిని పునరుద్ధరించడంలో సహాయం చేస్తున్నారు' అని తెలిపారు. భద్రతా సలహాదారు ప్రకారం, చాలా ప్రదేశాలలో 12 గంటల పాటు కర్ఫ్యూను ఎత్తివేశారు. క్రమంగా జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంటోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.